Follow: @ANNTELUGU
28-01-2026

# మహా పత్రిక

తెలుగు

బుధవారం, హైదరాబాద్ | సంపుటి- 23 | సంచిక- 32 | పేజీలు-08 | వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్

## శిల్పా శెట్టి రెస్టారెంట్‌లో ప్రారంభ ఆఫర్



- క్యూ కట్టిన కోటీశ్వరులు

02

## పడిపోతున్న డాలర్



- నిలకడగా రూపాయి
- ప్రపంచ మార్కెట్లో బలహీనపడుతున్న అమెరికా డాలర్

02

## ఆల్ టైమ్ గరిష్ఠానికి బంగారం, వెండి ధరలు



- 10 గ్రాముల బంగారం ధర రూ.1.66 లక్షలు

02



# మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ ఖరారు

### దేశ చరిత్రలోనే ఇది అతిపెద్ద ట్రేడ్ డీల్

### భారత్, ఈయూ డీల్ పై ప్రధాని మోదీ

### తగ్గనున్న అనేక వస్తువుల ధరలు.. పెరగనున్న ఎగుమతులు

### వస్త్ర, లెదర్, మెరైన్, రత్నాలు, ఆభరణాల పరిశ్రమలకు లబ్ధి

**ఢిల్లీ, మహా:**

భారత్ - యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం భారత వాణిజ్య చరిత్రలోనే అతి పెద్దదని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇది కేవలం వాణిజ్య ఒప్పందం మాత్రమే కాకుండా, ఇద్దరి సంక్షేమానికి బ్లూప్రింట్‌గా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంతో భారత వాణిజ్యంలో సరికొత్త శకం ప్రారంభమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో జరిగిన సంయుక్త విలేకరుల సమావేశంలో యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో కలిసి ప్రధాని మోదీ మాట్లాడారు. భారత గణతంత్ర దినోత్సవ వేడుకలకు తొలిసారి ఈయూ నేతలు ముఖ్య అతిథులుగా

మిగతా 2లో



## ఆకాశంలో విమాన విన్యాసాలు

నేటి నుండి హైదరాబాద్ లో వింగ్స్ ఇండియా 2026

ప్రదర్శనలో 200కు పైగా ప్రధాన కంపెనీలు

వివరాలు 2లో



## ఏపీకి రాహుల్ గాంధీ

షర్మిల ఆహ్వానానికి సానుకూల స్పందన

వివరాలు 2లో




## గుత్తా అమిత్ రెడ్డికి కీలక బాధ్యతలు

టీపీసీసీ వార్ రూం ఇన్ ఛార్జిగా నియామకం


ఓబిసి సెల్ ఛైర్మన్ గా షాద్ నగర్ ఎమ్మెల్యే శంకరయ్య

వివరాలు 2లో

## ఈ ఏడాదిలోనే భారత్-ఈయూ ఎఫ్ టీఏ అమల్లోకి

కేంద్రమంత్రి పీయూష్ గోయెల్

వివరాలు 2లో




# పురపోరుకు మోగిన నగారా

## నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

### ఫిబ్రవరి 11న పోలింగ్, 13న కౌంటింగ్.. అమల్లోకి వచ్చిన ఎలక్షన్ కోడ్

**హైదరాబాద్, మహా:** మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మంగళవారం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీంతో ఎన్నికలు జరిగే పట్టణాల్లో ఎన్నికల కోడ్ తక్షణమే అమల్లోకి వచ్చింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. జనవరి 30 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. జనవరి 31న స్క్రూటినీ, ఫిబ్రవరి 3న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఫిబ్రవరి 11వ తేదీన ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. బ్యాలెట్ పద్ధతిలోనే ఎన్నికలు జరగనున్నాయి. ఎక్కడైనా రీపోలింగ్ నిర్వహించాల్సి వస్తే ఫిబ్రవరి 12న నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 13న ఫలితాలు ప్రకటించనున్నారు. ఫిబ్రవరి 16 న 116 మున్సిపాలిటీల్లో చైర్ పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ ఎన్నిక, 7 కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఉండనుంది. షెడ్యూల్ విడుదల చేసిన అనంతరం ఎస్ఈసీ రాణి కుముదిని మాట్లాడుతూ.. మునిసిపాలిటీ, కార్పొరేషన్ ఎన్నికలలో మొత్తం 52,43,000 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు చెప్పారు. 2996 వార్డులకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందుకోసం మొత్తం 8195 పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7.00 గం. నుంచి సాయంత్రం 5.00 గం. వరకు పోలింగ్ జరుగనుందన్నారు. ఈ ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలీస్ యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి భద్రత కల్పిస్తామన్నారు. రేపటి నుంచి నామినేషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

### ముఖ్య తేదీలు

- నామినేషన్ల స్వీకరణ - జనవరి 28 నుంచి 30 వరకు
- నామినేషన్ల పరిశీలన - జనవరి 31
- నామినేషన్ల ఉపసంహరణ - ఫిబ్రవరి 3
- పోలింగ్ - ఫిబ్రవరి 11
- ఫలితాల వెల్లడి - ఫిబ్రవరి 13
- మేయర్, చైర్ పర్సన్‌ల ఎన్నిక - ఫిబ్రవరి 16

## టైం లేదు బాబు

- టెన్షన్ పెట్టిన ఎన్నికల సంఘం
- నేటి నుండి నామినేషన్లు.. ఎల్లుండి క్లోజ్
- ఉక్కిరిబిక్కిరవుతున్న నేతలు

02

## దయ్యం నెంబర్ వన్

# సంతోష్ రావే

### సంతోష్ రావు రేవంత్ రెడ్డి సీక్రెట్ ఏజెంట్

కేసీఆర్ సగం ఇడ్లీ తిన్నరా.. ఫుల్ ఇడ్లీ తిన్నరా చెప్పేది ఈయనే

గుంపుమేస్త్రీ గూఢాచారికి శిక్ష వేయడు.. సిట్ విచారణ వేళ కవిత సంచలన ఆరోపణలు



**హైదరాబాద్, మహా:**

బీఆర్ఎస్ పార్టీలో దెయ్యం నెంబర్ వన్ సంతోష్ రావే అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చెప్పేసింది. సంతోష్ రావు కేసీఆర్ కళ్లుగప్పి ఉద్యమకారులను ఆయనకు దూరం చేశారని ఆమె ఆరోపించారు. "నేను మొదటి నుంచీ చెబుతున్నాను.. ఈ సంతోష్ రావు ఒక దయ్యం. ఉద్యమ నాయకుడిని సొంత మనుషులకు దూరం చేసింది అతనే. చివరకు గద్దర్ లాంటి గొప్ప నాయకులు కూడా గేటు బయటే ఉండాల్సి వచ్చిందంటే అది సంతోష్‌రావు కుట్రల వల్లే" అని ఆమె మండిపడ్డారు. అంతేకాకుండా గుంపుమేస్త్రీకి గూఢాచారి ఈయనే అంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఫామ్ హౌజ్ లో కేసీఆర్ సగం ఇడ్లీ తిన్నరా.. ఫుల్ ఇడ్లీ తిన్నరా రేవంత్ కు చెప్పేది ఇతనే అంటూ మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులకు రక్తకన్నీరు పెట్టించి పార్టీని వెళ్ళిపోవడానికి కారణం.. అన్ని దుర్మార్గాలకు సెంటర్ పాయింట్ మొదటి దయ్యం ఈ సంతోషే అని అన్నారు.

**కేసీఆర్‌కి తెలియకుండా సంతోష్ చాలా చేశారు**

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, గృహహింస పెరిగిపోతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ పోలీసులు అంటే గంజాయి స్మగ్లర్లకు భయం లేకుండా పోయిందని, వారి

మిగతా 2లో

## జోగినపల్లి సంతోష్‌ను విచారించిన సిట్

- ట్యాపింగ్ పై ఆధారాలతో అధికారుల ప్రశ్నలు
- కేసీఆర్ కుటుంబంలో ముగ్గురిని విచారించిన సిట్
- తర్వాత కవిత లేదా కేసీఆర్ ని పిలవొచ్చంటూ ప్రచారం

02

# దారులన్నీ మేడారం వైపే..

### మహా జాతరకు సర్వం సిద్ధం చేసిన సర్కార్

### శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్



**హైదరాబాద్, మహా:** మేడారం మహా జాతరను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసింది. ఆలయ అభివృద్ధి, జాతర ఏర్పాట్ల కోసం రూ.251 కోట్ల వ్యయం చేసింది. మొత్తం 21 శాఖలకు చెందిన 42027 మంది అధికారులు, సిబ్బంది మేడారం జాతర లోవిధులు నిర్వహించనున్నారు. మరో 2000 మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా సేవలందించనున్నారు. మొబైల్ నెట్‌వర్క్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా 27 శాశ్వత టవర్లతో పాటు 33 మొబైల్ టవర్లను, 450 వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు. జాతరకు ఉపయోగపడే కొత్త రోడ్లు, మరమ్మతులు, కల్వర్టులతో రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు.

## రాష్ట్ర ప్రజలకు రేవంత్ రెడ్డి, కేసీఆర్ శుభాకాంక్షలు

మేడారం యాత్రికులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మేడారం సందర్శించి సమ్మక్క-సారలమ్మ కృపకు పాత్రులు కావాలని, భక్తులు దర్శనానంతరం క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని ఆకాంక్షించిన సీఎం భక్తులకు అసౌకర్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు. మాజీ సీఎం కేసీఆర్ మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ త్యాగానికి, ధిక్కారానికి ఆదివాసీ దేవతలు సమ్మక్క సారలమ్మలు ప్రతీకలని కేసీఆర్ అన్నారు. కొంగు బంగారమై కోరిన కోరికలు తీర్చే తమ ఇలవేల్పులకు మొక్కులు తీర్చుకునేందుకు కోట్లాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం జాతర కుంభమేళాను తలపిస్తూ ఆధ్యాత్మిక కేంద్రమై కొనసాగుతుందని తెలిపారు.

ప్రత్యేక కథనం 4లో

## మేమిద్దరం కలిస్తే బీఆర్ఎస్ గల్లంతే

### ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం.. విజయం సాధిస్తామని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ధీమా వ్యక్తం చేశారు. నేను, మెదక్ ఎంపీ రఘునందన్ రావు కలిస్తే బీఆర్ఎస్ గల్లంతు కావడం ఖాయమని అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏ పార్టీలో అయినా గ్రూపు రాజకీయాలు, విభేదాలు సర్వసాధారణం అని అన్నారు. బీఆర్ఎస్‌లో కుటుంబ గొడవ, కాంగ్రెస్‌లో మంత్రుల కొట్లాటలు చూస్తూనే ఉన్నామని తెలిపారు. అనంతరం రఘునందన్ రావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల కోసం ఇన్‌చార్జులను ఎప్పుడో రంగంలోకి దించామని అన్నారు. రేపో మాపో అభ్యర్థులను ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో, అన్ని కార్పొరేషన్లలో తమకు కాంగ్రెస్‌తోనే పోటీ అని.. బీఆర్ఎస్ ప్రభావం ఉంటుందని తాను అనుకోవడం లేదని కీలక వ్యాఖ్యలు చేశారు.



## బొగ్గు స్కామ్ పై సమగ్ర దర్యాప్తు జరపండి

### సీబీఐకి ఇస్తారా? సిట్టింగ్ జడ్జికి ఇస్తారా?

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### గవర్నర్ ను కలిసిన బీఆర్ఎస్ బృందం

**హైదరాబాద్, మహా :** సింగరేణిలో బొగ్గు స్కామ్ జరిగిందని ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపించేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను బీఆర్ఎస్ నేతలు కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని

మిగతా 2లో

## ఒంటినిండా విషం నింపుకుని

- కాంగ్రెస్ పై విషం చిమ్ముతున్నారు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేతలు అధికారం కోల్పోయిన తర్వాత అచ్చేసిన ఆంబోతుల్లా రంకెలు వేస్తూ, ఒంటినిండా విషం నింపుకుని కాంగ్రెస్ పట్ల విషం చిమ్ముతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజల శ్రేయస్సు కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వంలో రూపొందిన మంచి పథకాలను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్నామని వివరించారు. రాబోయే ఏప్రిల్ నెలలో మళ్లీ కొత్త ఇళ్లు మంజూరు చేస్తామని, ఆ తర్వాత మరో మూడు దఫాలుగా ఇళ్లు మంజూరీ చేస్తామని ప్రకటించారు. ప్రజలు గతంలో ఏం జరిగిందో గుర్తుంచుకోవాలని, ప్రస్తుత ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తోందని స్పష్టం చేశారు.

# టైం లేదు బాబు

**హైదరాబాద్, మహా:** ఎన్నికల సంఘం షెడ్యూల్ రిలీజ్ చేసింది. కీలకమైన ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేసేందుకు కనీస సమయం కూడా ఇవ్వలేదు .నేటి నుండి నామినేషన్ల ప్రకియ ప్రారంభం అవుతుండటం.. కేవలం 3 రోజులు అంటేఎల్లుండి వరకే నామినేషన్లకు అవకాశం కల్పించడంతో ఆయా పార్టీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఈసీ ఇచ్చిన మూడు రోజుల వ్యవధిలోనే అభ్యర్థులను ఖరారు చేసుకోవడం, వారికి బీఫాం ఇవ్వడం చేయాలంటే ఆయా పార్టీలకు పెద్ద టెన్షన్‌తో కూడిన పనే అని చెప్పాలి. పైగా ప్రచారం చేసే సమయం కూడా పెద్దగా లేదు. ఫిబ్రవరి 11వ తేదీనే రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. దీంతో ప్రచారానికి కూడా ఎక్కువ సమయం లేకుండా పోయింది. రాష్ట్ర వ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో 2,996 వార్డులకు ఎన్నికలు జరగనుండగా.. ఆయా స్థానాల్లో పోటీ చేసేందుకు, ప్రధాన పార్టీల నుంచి టికెట్ పొందేందుకు ఎంతోమంది ఆశావహులు ఎదురు చూస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలు త్వరలో జరగనున్నాయని సమాచారం బయటకు వచ్చినప్పటి నుంచే ఆశావహులు తమ తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తూ వచ్చారు. గ్రౌండ్ లెవల్లో పనులు చేసుకుంటూనే.. పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమైపోయారు. అయితే, ఆశావహులు ఎంతమంది ఉన్నప్పటికీ.. పార్టీల తరఫున టికెట్ మాత్రం కొందరికే వచ్చే అవకాశం ఉంటుంది. ఇందుకోసం అభ్యర్థుల బలాబలాలను పరిశీలించి.. ఎవరైతే గెలవగలరో వారికి మాత్రమే టికెట్ కేటాయిస్తారు. ఈ తతంగం అంతా చేయాలంటే ఖచ్చితంగా టైమ్ పడుతుంది. కానీ, ఈసీ మాత్రం రాజకీయ పార్టీలకు అంత టైమ్ లేదని చెప్పేసింది. కేవలం మూడు రోజులు మాత్రమే నామినేషన్లకు అవకాశం ఇవ్వడంతో.. ఆయా పార్టీల్లో, ఆశావహుల్లో టెన్షన్ నెలకొంది.

**షాకిచ్చిన ఎన్నికల సంఘం**

ఎలాగైనా టికెట్ దక్కించుకోవాలని ఆశావహులు.. గెలుపు గుర్రాలకే టికెట్ ఇవ్వాలని రాజకీయ పార్టీలు భావిస్తున్న తరుణంలో.. ఈసీ నోటిఫికేషన్ అందరికీ షాకిచ్చింది. అభ్యర్థులను ఎలా ఎంపిక చేయాలి.. ఎవరిని ఎంపిక చేయాలి.. టికెట్ ఆశించి భంగపడిన వారిని ఎలా కంట్రోల్ చేయాలా అని ఆయా పార్టీల పెద్దలు సతమతం అవుతున్నారు. అభ్యర్థుల ఎంపికల విషయంలో తొందరపడితే నష్టపోవచ్చనే భయం అన్ని పార్టీల నేతలను వెంటాడుతోంది. అలాగని ఆచితూచి చూద్దామంటే టైం లేదు. దీంతో అందరిలోనూ టెన్షన్ నెలకొంది.

# బొగ్గు స్కామ్‌పై సమగ్రదర్యాప్తు జరపండి

(మొదటిపేజీ తరువాయి)

బీఆర్ఎస్ బృందం మంగళవారం లోక్ భవన్‌లో గవర్నర్‌ను కలిసి సింగరేణిలో బొగ్గుస్కామ్ జరిగిందని ఫిర్యాదు చేశారు. ఈ స్కామ్‌కు సంబంధించిన వివరాలను గవర్నర్‌కు అందజేశారు. అనంతరం లోక్ భవన్ బయట కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫుట్ బాల్ మ్యాచ్ కోసం రూ. 10 కోట్ల సింగరేణి నిధులు దుర్వినియోగం చేశారని ఇప్పటికే ప్రజలతో ఆడుకుంటున్న సీఎం.. సింగరేణి సంస్థతో కూడా ఫుట్ బాల్ ఆడుతున్నారని ఆరోపించారు.

**సీబీఐకి ఇస్తారా? సిట్టింగ్ జడ్జికి ఇస్తారా?**

సీఎం అంటే కోల్ మాఫియాకు నాయకుడిగా భావించే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఆధారాలతో సహా భయటపెట్టినప్పటి నుంచి కాంగ్రెస్‌లో వణుకు మొదలైందని ఈ కుంభకోణాన్ని బట్టబయలు చేశాక పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని విమర్శించారు. ఆధారాలతో కుంభకోణాలు బయటపెట్టినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాలేదని అన్నారు. ఓబీ టెండర్లలో సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనతో పారదర్శకతకు పాతరేశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా సింగరేణి టెండర్లలో నిబంధనలు పెట్టారని ఆరోపించారు. అన్ని విషయాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కాంట్రాక్టర్లను బెదిరించి, కాంట్రాక్టర్లను రింగు చేసి ప్రజా ధనాన్ని దోచుకుంటున్న తీరును సైతం వివరించామన్నారు. గవర్నర్ ఇన్వాల్వ్ కావాలని.. కేంద్రం మంత్రి కిషన్‌రెడ్డికి ఆదేశం ఇవ్వాలని కోరామని చెప్పారు. 'సీబీఐకి



ఇస్తారా? సిట్టింగ్ జడ్జికి ఇస్తారా? మీ ఇష్టం ఎవరికి ఇస్తారో ఇవ్వండి. కానీ ప్రజా ధనాన్ని కొల్లగొట్టే ఈ దుర్మార్గపు వ్యవస్థను, అటు సోలార్ పవర్‌లో, ఇటు సింగరేణి ఓబీ గనుల్లో కుంభకోణం.. దీన్ని అడ్డుకోండి' అని విన్నవించినట్లు చెప్పారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసానిలతో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు గవర్నర్ ను కలిసిన వారిలో ఉన్నారు.

# మదర్ ఆఫ్ ఆల్ డీల్స్ ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

హాజరైన మరుసటి రోజే కీలక ఒప్పందం కుదరడం చరిత్రాత్మక ఘట్టమని ఆయన అన్నారు.

**వేగంగా బలోపేతం**

ఇటీవలి కాలంలో భారత్ ఈయూ సంబంధాలు వేగంగా బలోపేతమయ్యాయని ప్రధాని మోదీ తెలిపారు. ప్రస్తుతం భారత్ ఈయూ మధ్య వాణిజ్యం 180 బిలియన్ యూరోల స్థాయికి చేరిందని వెల్లడించారు. ఎనిమిది లక్షల మందికి పైగా భారతీయులు ఈయూ దేశాల్లో నివసిస్తూ అక్కడి సమాజాలకు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ పాలన, అభివృద్ధి భాగస్వామ్యం వంటి రంగాల్లో విస్తృత సహకారం కొనసాగుతోందని మోదీ తెలిపారు. ఈ ఒప్పందంతో రైతులు, చిన్న వ్యాపారులు, సేవల రంగానికి చెందినవారికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. యూరోపియన్ మార్కెట్లకు భారత ఉత్పత్తులకు మరింత విలువ లభిస్తుందని, పెట్టుబడులు పెరుగుతాయని, సరఫరా వ్యవస్థ మరింత బలపడుతుందని అన్నారు.

**కీలక ఒప్పందం ఖరారు**

16వ భారత్ - ఈయూ సదస్సు సందర్భంగా ప్రతినిధి స్థాయి చర్చల అనంతరం కీలక ఒప్పందం ఖరారైంది. ఇదే సమయంలో భద్రత, రక్షణ భాగస్వామ్య ఒప్పందం కూడా కుదిరింది. జపాన్, దక్షిణ కొరియా తర్వాత ఆతరహా ఒప్పందం చేసుకున్న మూడో ఆసియా దేశంగా భారత్ నిలిచింది. ఇండియా ఎనర్జీ వీక్ కార్యక్రమంలో మోదీ, భారత్ ఈయూ ఒప్పందాన్ని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా అభివర్ణించారు. ప్రపంచ జీడీపీలో నాలుగో వంతు వాటా కలిగిన రెండు ప్రధాన ఆర్థిక శక్తులను కలుపుతున్న కీలక ఒప్పందమిదని అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల భారత్‌కు చెందిన వస్తు, ఉత్పత్తుల్లో 99 శాతానికిపైగా ప్రాధాన్యతా ప్రాతిపదికన ఈయూ మార్కెట్లోకి ప్రవేశాన్ని పొందుతాయి. ఈ అంశం భారతీయ వస్త్ర, లెదర్, మెరైన్, రత్నాలు, ఆభరణాల ఉత్పత్తుల పరిశ్రమలకు కలిసొస్తుంది.

# క్రమశిక్షణ తప్పిన ఖాకీలు

- **పోలీస్ స్టేషన్‌లో హైడ్రామా**
- **ఏసీపీ వర్సెస్ ఎస్సై**
- **కేసు ఫైళ్ల కోసం ఇద్దరి మధ్య 'వార్'**




**హైదరాబాద్, మహా :** శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసు శాఖలో క్రమశిక్షణ తప్పింది. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఒక కీలక డివిజన్‌లో ఏసీపీ ర్యాంక్ ఉన్నతాధికారి అడ్మిన్ ఎస్సై మధ్య జరిగిన వాగ్వాదం ఇప్పుడు పోలీసు వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇతర సిబ్బంది ముందే వీరిద్దరూ ఒకరిపై ఒకరు అరుచుకోవడం, చివరకు ఈ వ్యవహారం ఉన్నతాధికారుల వరకు వెళ్లడం సంచలనం సృష్టిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని ఒక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇటీవల సెలవుపై వెళ్లారు. ఆయన లేని సమయంలో డివిజన్ ఏసీపీ కొన్ని కీలక కేసులకు సంబంధించిన ఫైళ్లను తన వద్దకు తీసుకురావాలని స్టేషన్ అడ్మిన్ ఎస్సైని ఆదేశించారు. అయితే ఆ ఎస్సై ఏసీపీ ఆదేశాలను సున్నితంగా తిరస్కరించారు. 'ఎస్‌హెచ్‌వో గారు సెలవులో ఉన్నారు. ఆయనకు తెలియకుండా, ఆయన అనుమతి లేకుండా ఫైళ్లను బయటకు తీసుకురావడం నిబంధనలకు విరుద్ధం' అని బదులిచ్చారు. ఎస్సై సమాధానంతో ఆగ్రహానికి గురైన ఏసీపీ.. పై అధికారినైన నా ఆదేశాలనే ధిక్కరిస్తావా ? అంటూ గట్టిగా మందలించారు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం పెరిగి స్టేషన్ సిబ్బంది చూస్తుండగానే ఒకరిపై ఒకరు గట్టిగా అరుచుకున్నారు. ఉన్నతాధికారి అని చూడకుండా ఎస్సై ఎదురుతిరగడం, ఏసీపీ కూడా పట్టుబట్టడంతో అక్కడ కాసేపు ఉద్రిక్తత నెలకొంది. సదరు ఫైళ్లు అత్యంత కీలకమైన కేసులు కావడంతోనే ఏసీపీ వాటిని అడిగారని, కానీ ప్రోటోకాల్ విషయంలో ఎస్సై పట్టుబట్టారని తెలుస్తోంది. ఠాణాలో జరిగిన ఈ వ్యవహారం కమిషనరేట్ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్ళింది. వెంటనే స్పెషల్ బ్రాంచ్ అధికారులు రంగంలోకి దిగి ప్రాథమిక విచారణ చేపట్టారు. అసలు గొడవకు కారణమేంటి ? ఆ ఫైళ్లలో ఏముంది ? ఎస్సై ఎందుకు నిరాకరించారు ? అనే కోణంలో విచారణ జరిపి ఒక నివేదికను రూపొందించారు. ఈ నివేదికను ఇప్పటికే ఉన్నతాధికారులకు సమర్పించినట్లు సమాచారం. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, ఈ ఘటన పోలీస్ శాఖలో కలకలం రేపుతోంది.

# ఈ ఏడాదిలోనే భారత్-ఈయూ ఎఫ్ టీఏ అమల్లోకి

## కేంద్రమంత్రి పీయూష్ గోయెల్

**హైదరాబాద్, మహా :** గుత్తా అమిత్ రెడ్డి కి టీపీసీసీ కీలక బాధ్యతలు అప్పగించింది. రాష్ట్రంలో జరగనున్న మున్సిపల్ సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వార్‌రూమ్ చైర్మన్‌గా గుత్తా అమిత్ రెడ్డిని తక్షణమే అమలులోకి వచ్చే విధంగా నియమిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో జరగబోయే పురపాలక సంఘాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ బాధ్యతలను ఆయనకు అప్పగించారు. అమిత్ రెడ్డి నాయకత్వంలో వార్ రూమ్ మరింత సమర్థవంతంగా పనిచేస్తూ ఎన్నికల వ్యూహాలను పకడ్బందీగా అమలు చేయనుందని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

**ఓబీసీ సెల్ చైర్మన్ గా షాద్ నగర్ ఎమ్మెల్యే**

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)కి చెందిన ఓబీసీ విభాగానికి నూతన నియామకాలు చేపట్టారు. టీపీసీసీ ఓబీసీ విభాగం చైర్మన్‌గా కె. శంకరయ్యను నియమించేందుకు కాంగ్రెస్ అధ్యక్షులు ఆమోదం తెలిపారు. ఓబీసీ విభాగం కన్వీనర్లుగా డా. కేతూరి వెంకటేశ్, డా. జులూరు ధనలక్ష్మిలను నియమించారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) జనరల్ సెక్రటరీ కె.సి. వేణుగోపాల్ విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తెలంగాణలో ఓబీసీ వర్గాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# శిల్పా శెట్టి రెస్టారెంట్‌లో ప్రారంభ ఆఫర్

**మహా:** బాలీవుడ్ నటి శిల్పా శెట్టి సహ యజమానిగా ఉన్న కొత్త రెస్టారెంట్ 'అమ్మకాయి' వద్ద భారీ రద్దీ నెలకొంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉచితంగా టిఫిన్ అందిస్తామని ప్రకటించడంతో, ముంబైలోని బాంద్రాలో ఉన్న ఈ రెస్టారెంట్ ముందు ప్రజలు బారులు తీరారు. ఈ ఘటన సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. వివరాల్లోకి వెళితే, జనవరి 26న రిపబ్లిక్ డేను పురస్కరించుకుని, లాంచింగ్ ఆఫర్ ప్రకటించారు. ఉదయం 9:30 నుంచి 11:30 గంటల వరకు ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో ఉచితంగా దోసె, ఇడ్లీ వంటి దక్షిణ భారతీయ వంటకాలను అందిస్తామని తెలిపారు. అయితే, ఈ ఆఫర్ కోసం ఉదయం 7 గంటల నుంచే వందలాది మంది క్యూలో నిలబడ్డారు. ఊహించని రద్దీ కారణంగా ఆఫర్ సమయాన్ని మధ్యాహ్నం 1 గంట వరకు పొడిగించినప్పటికీ, చాలా మంది నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. కాగా, ఉచిత ఆఫర్ కోసం క్యూలో కొందరు ధనికులు కూడా నిల్చుని ఉండడం ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ఉచిత ఆఫర్ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# జోగినపల్లి సంతోష్ ను విచారించిన సిట్

**హైదరాబాద్, మహా :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కుటుంబానికి చెందిన ముగ్గురిని సిట్ అధికారులు విచారించారు. మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్‌లతో పాటు మంగళవారం మాజీ ఎంపీ సంతోష్‌రావు ను విచారించారు. సుమారు ఐదు గంటల పాటు సంతోష్‌రావును సిట్ అధికారులు ప్రశ్నించారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్‌రావు నియామకంపై నిర్ణయం ఎవరిదంటూ సంతోష్‌రావును సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కొన్ని ఆధారాలు ముందు పెట్టి ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలుస్తోంది. సంతోష్‌రావు స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కోసమే రిటైర్డ్ అయిన తరువాత కూడా ఎస్ఐబీ చీఫ్, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ప్రభాకర్ రావును ప్రభుత్వం కొనసాగించినట్లు సిట్ అనుమానిస్తోంది. ఈ బాధ్యతలు అప్పగించడంలో నిర్ణయం, ఆదేశాలు ఎవరిచ్చారనే దానిపై సంతోష్ రావును సిట్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్‌లో ఆయన కొన్ని నంబర్లను ఎస్ఐబీకి ఇచ్చి ట్యాప్ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఏ నంబర్ ట్యాప్ చేయాలో సంతోష్ రావు నుంచి ఆదేశాలు అందినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. మాజీ మంత్రులు హరీష్, కేటీఆర్ లను విచారించిన సిట్.. వారి సమా




ధానాలతో పోల్చిచూసినట్లు సమాచారం.

**తర్వాత ఎవరు?**

సిట్ విచారణలో కేసీఆర్ కుటుంబానికి సంబంధించిన ముగ్గురిని విచారించగా, తన ఫోన్.. తన భర్త ఫోన్ కూడా ట్యాప్ చేశారని కవిత పలుమార్లు ఆవేదన వ్యక్తం చేసిన నేపథ్యంలో కవితను విచారణకు పిలుస్తారా? లేక ప్రభాకర్ రావు నియామకంతో పాటు కీలక ఆరోపణల నేపథ్యంలో కేసీఆర్‌కు నోటీసులిచ్చి పిలుస్తారా ? అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది.

## దయ్యం నెంబర్ వన్

# సంతోష్ రావే

(మొదటిపేజీ తరువాయి)

వద్ద ఆయుధాలు ఉంటేనే నేరగాళ్లు భయపడతారని ఆమె అభిప్రాయపడ్డారు. ఫారెస్ట్, ఎక్సైజ్ అధికారులకు తిరిగి వెపన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని 'గుంపు మేస్త్రీ' పాలనగా అభివర్ణించిన కవిత, సంతోష్ రావు లాంటి వ్యక్తులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోదని విమర్శించారు. సంతోష్ రావును సిట్ విచారణకు పిలవడం సరైనదే కానీ, ఆయనకు ఎలాంటి శిక్ష విధిస్తారో వేచి చూడాలని అన్నారు. గుంపుమేస్త్రీ గూఢాచారికి శిక్షవేయడన్నారు. "సొంత నీడను కూడా నమ్మలేని పరిస్థితి ఉంది. కేసీఆర్‌కి తెలియకుండా సంతోష్ చాలా విషయాలు కప్పిపుచ్చారు" అని ఆమె పేర్కొన్నారు.

# ఈ ఏడాదిలోనే భారత్-ఈయూ ఎఫ్ టీఏ అమల్లోకి

## కేంద్రమంత్రి పీయూష్ గోయెల్


**ఢిల్లీ, మహా:** భారత్ ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కీలక ప్రకటన చేశారు. ఈ చారిత్రక ట్రేడ్ డీల్ 2026 సంవత్సరంలోనే అమల్లోకి వచ్చే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. భారత్, యూరోపియన్ యూనియన్‌లోని 27 దేశాల కూటమి మధ్య ఒప్పందం ఖరారైనందున, తదుపరిగా శరవేగంగా చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేయడంపై ఫోకస్ పెడతామన్నారు. ఈ ఒప్పందం అమలుకు సంబంధించిన వేడుకలను కూడా ఈ ఏడాదే జరుపుకుంటామనే ఆశాభావాన్ని పీయూష్ గోయల్ వ్యక్తం చేశారు. ప్రతీ ఒప్పందం దేనికది ప్రత్యేకమైందని, ఈ ట్రేడ్ డీల్ మాత్రం అద్భుతమైందని ఆయన కొనియాడారు.

# ఆకాశంలో విమాన విన్యాసాలు

**హైదరాబాద్, మహా :** నేటి నుండి విమాన విన్యాసాలు హైదరాబాద్ వాసులకు కనులవిందు చేయనున్నాయి. కేంద్ర విమానయాన శాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఫిక్కీ) సంయుక్తంగా ఈ నెల 28 నుంచి 31 వరకు బేగంపేట విమానాశ్రయంలో వింగ్స్ ఇండియా-2026 నిర్వహించనున్నాయి. విన్యాసాలను వీక్షించేందుకు మొదటి రెండు రోజులు వ్యాపార, వాణిజ్యవేత్తలకు, తరువాతి రెండు రోజులు సామాన్యులకు అనుమతిస్తారు. సూర్యకిరణ్ ఏరోబాటిక్స్, మార్క్ జెఫ్రీ ఏరోబాటిక్స్ బృందాలు నాలుగు రోజులపాటు ఒళ్లు గగుర్పొడిచే వైమానిక విన్యాసాలు చేయనున్నాయి.

**బుక్ మై షో ద్వారా**

నాలుగు రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 11.00-11.30 గంటల వరకు సూర్యకిరణ్ టీమ్, మధ్యాహ్నం 12.00-12.30, సాయంత్రం 4.00-4.30 వరకు మార్క్‌జెఫ్రీ బృందం వైమానిక విన్యాసాలు



ప్రదర్శించనున్నాయి. ప్రారంభ రోజైన బుధవారం మాత్రం అదనంగా రాత్రి 7.30 నుంచి 8 గంటల వరకు మార్క్ జెఫ్రీ బృందం ప్రదర్శనతో పాటు సాయంత్రం 6.30 నుంచి 7 గంటల వరకు డ్రోన్ షో కనువిందు చేయనుంది. మొత్తంగా 13 సార్లు విమాన విన్యాసాలు, ఒక డ్రోన్ షో నిర్వహించనున్నారు. బుక్ మై షో ద్వారా టికెట్లను కొనుగోలు చేసుకోవచ్చని వింగ్ ఇండియా-2026 వర్గాలు పేర్కొంటున్నాయి. పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఇండియన్ ఏవీయేషన్-2026ను ప్రారంభించనున్నారు. 200లకు పైగా ప్రధాన కంపెనీలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి.

# ఆల్ టైమ్ గరిష్ఠానికి బంగారం, వెండి ధరలు

## 10 గ్రాముల బంగారం ధర రూ.1.66 లక్షలు

**మహా:** దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు మంగళవారం సరికొత్త చరిత్ర సృష్టించాయి. మునుపెన్నడూ లేని విధంగా జీవితకాల గరిష్ఠ స్థాయికి చేరి, మదుపరులను, వినియోగదారులను ఆశ్చర్యపరిచాయి. మంగళవారం ట్రేడింగ్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.1.66 లక్షలకు చేరగా, కిలో వెండి ధర ఏకంగా రూ.3.7 లక్షలు పలికింది. సోమవారం ముగింపు ధర రూ.1,58,700తో పోలిస్తే, 10 గ్రాముల బంగారంపై ఒక్కరోజే రూ.7,300 (4.6 శాతం) పెరిగింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఫిబ్రవరి ఫ్యూచర్స్ ట్రేడింగ్ సమయంలో రూ.1,59,820 వద్ద ఆల్ టైమ్ రికార్డును నమోదు చేసింది. బంగారం బాటలోనే వెండి కూడా పరుగులు పెట్టింది. ఎంసీఎక్స్‌లో మార్చి ఫ్యూచర్స్ కిలోకు రూ.3,64,000 మార్కును దాటగా, రిటైల్ మార్కెట్లో ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ముంబై, ఢిల్లీలలో కిలో వెండి ధర రూ.3.7 లక్షలు ఉండగా, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో ఇది రూ.3,87,000 వరకు పలికింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి వల్లే ఈ ధరల పెరుగుదల చోటుచేసుకుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.



# ఏపీకి రాహుల్ గాంధీ

## షర్మిల ఆహ్వానానికి సానుకూల స్పందన

**ఢిల్లీ, మహా:** ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని ఆమె చేసిన ఆహ్వానానికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ఏపీ పర్యటనకు వస్తానని, పార్టీ పోరాటంలో భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చినట్లు షర్మిల తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని 10 జనపథ్‌లో ఉన్న రాహుల్ గాంధీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందిగా షర్మిల రాహుల్‌ను కోరారు. ఇందుకు రాహుల్ అంగీకరించారని, త్వరలోనే ఏపీకి వస్తానని మాట ఇచ్చారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 2వ తేదీతో ఉపాధి హామీ పథకం ప్రారంభమై 20 ఏళ్లు పూర్తికానుంది. ఈ నేపథ్యంలో, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిన అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామం నుంచే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నట్లు షర్మిల వివరించారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని ఆమె వెల్లడించారు.

# అది సీక్రెట్ మీటింగ్ కాదు

- **మునిసిపల్ ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు కలిశాం**
- **మంత్రుల సమావేశంపై శ్రీధర్ బాబు క్లారిటీ**

**హైదరాబాద్, మహా :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో మంత్రుల భేటీపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. లోక్ భవన్ నుంచి అందరి ముందే తామంతా ఒకే కారులో వెళ్లామని, అలా బహిరంగంగా వెళ్లినప్పుడు అది రహస్య భేటీ ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తుల భేటీకి రాజకీయ రంగులు పులుముతూ విషప్రచారం చేయడం సరికాదని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన పార్టీ వ్యూహాలపై చర్చించడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశమని శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల సన్నద్ధత అనేది రాజకీయ పార్టీల ప్రాథమిక బాధ్యత అని, దీనిపై చర్చించుకోవడాన్ని తప్పు పట్టాల్సిన అవసరం లేదని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకే కొందరు కావాలనే ప్రభుత్వంపై అసత్య ప్రచారాలకు ఒడిగడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలనలో సమన్వయం కోసమే తాము సమావేశమయ్యామని, క్యాబినెట్ అనేది ఒక యూనిట్ లాంటిదని మంత్రి వివరించారు. పాలనాపరమైన అంశాల్లో ఎక్కడా జాప్యం జరగకుండా చూడటం సీనియర్ మంత్రులుగా తమ బాధ్యత అని పేర్కొన్నారు. భట్టి విక్రమార్క నివాసంలో జరిగిన చర్చలన్నీ కేవలం ప్రభుత్వం మరియు పార్టీ సమష్టి బాధ్యతలో భాగమేనని, ఇందులో దాపరికాలు ఏమీ లేవని ఆయన తేల్చి చెప్పారు.నిర్మాణాత్మకమైన విమర్శలను తాము ఎప్పుడూ స్వాగతిస్తామని, అయితే కేవలం ఊహాజనిత కథనాలతో వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని శ్రీధర్ బాబు హెచ్చరించారు. భావితరాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిని అడ్డుకోకుండా, ఇలాంటి తప్పుడు ప్రచారాలు మానుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

**అసలేం జరిగిందంటే ?**

హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం రాత్రి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్ భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం దేశంలో లేని సమయంలో నలుగురు మంత్రులు సమావేశం కావడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. లోక్‌భవన్‌లో గవర్నర్ నిర్వహించిన 'ఎట్ హోం' కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మంత్రులు అక్కడ నుండి నేరుగా ప్రజాభవన్‌కు వెళ్లారు. సీఎం రేవంత్ అమెరికాలో లీడర్ షిప్ కోర్సు చేసేందుకు వెళ్లిన సమయంలో మంత్రులు భేటీ కావడంతో ఏదో జరుగుతోందని ప్రచారం ప్రారంభమయింది. దీనిపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా స్పందించారు. రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్న సమయంలో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో నలుగురు మంత్రులు సమావేశం కావడంలో ఆశ్చర్యం లేదన్నారు. సీఎం అందుబాటులో లేనప్పుడు పాలనాపరమైన అంశాలపై మంత్రులు చర్చించుకోవడంలో తప్పులేదన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సజావుగా సాగడానికి మంత్రుల మధ్య సమన్వయం అవసరం. అందులో భాగంగానే భట్టితో ముగ్గురు మంత్రులు భేటీ అయ్యారని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై భేటీలో పాల్గొన్న శ్రీధర్ బాబు క్లారిటీ ఇవ్వడంతో ఈ ప్రచారానికి తెరపడినట్లయింది.

# పడిపోతున్న డాలర్.. నిలకడగా రూపాయి

## ప్రపంచ మార్కెట్‌లో బలహీనపడుతున్న అమెరికా డాలర్

**మహా:** ప్రపంచ కరెన్సీ మార్కెట్లలో ఒడిదొడుకులు సంచలనాలకు కారణమవుతున్నాయి. ప్రధాన కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ బలహీనపడుతుండగా, భారత రూపాయి మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. డాలర్ బలహీనత కారణంగా భారత్‌లోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు పెరిగే అవకాశం ఉందని ఎమ్‌కే వెల్త్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ మంగళవారం విడుదల చేసిన నివేదికలో అంచనా వేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను మరింత తగ్గించవచ్చన్న అంచనాలు, అంతర్జాతీయ పరిణామాల కారణంగా డాలర్ విలువ పడిపోతోందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సుమారు రూ.90 వద్ద నిలకడగా ఉందని, స్వల్పకాలంలో ఇదే స్థాయిలో కన్సాలిడేట్ కావొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నట్లు రిపోర్ట్ లో పేర్కొంది. భారత్ నికర దిగుమతిదారుగా ఉండటం రూపాయిపై భారం మోపుతున్నప్పటికీ, విదేశీ పెట్టుబడులకు అవకాశాలు మెరుగుపడటం మద్దతుగా నిలుస్తుందని వివరించింది.



# సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా...

### కార్పొరేటర్ తోకల



**రాజేంద్రనగర్, మహా ;** మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మి గూడా వాంబే కాలనీ లో అభివృద్ధి పనులో భాగంగా పలు బ్లాక్ మధ్య లో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను రాజేంద్ర నగర్ నియోజక వర్గ ఇంచార్జ్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు పార్టీ నాయకులతో కలిసి పనులను పర్యవేక్షించారు. పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భూగర్భ డ్రైనేజ్ పనుల గురించి అధికారులతో చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన పనులను పూర్తి చేసి డివిజన్ ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, ప్రసాద్, హెచ్ఎం డబ్ల్యూ ఎస్ ఎస్బి అధికారులు, జనార్ధన్, సచిన్ షిండే, పూజ, లలిత గౌడ్, కిరణ్, రాధమ్మ, యూత్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఓ ఆఫీస్ పైరవీ కారుని సర్వేని అడ్డుకున్న రైతులు..



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ జోన్ పరిధి కోత్వాల్ గూడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్, 450, 460 లో సుమారు 30 ఎకరాల భూమిలో 15 సంవత్సరాల క్రితం కొత్తూరు శ్రీనివాస్ రెడ్డి బంధువులు ఒక ఎకరా కొనుగోలు చేశారు. 15 సంవత్సరాల తర్వాత మళ్లీ మంగళవారం సీంఓ కార్యాలయం అండదండలతో అధికార బలంతో రెవెన్యూ అధికారులకు హుకుం జారీ చేసి కోత్వాల్ గూడ సర్వేనెంబర్ 450, 460లో పోలీసు బలగాలతో సర్వేకు సిద్ధమయ్యారు. చుట్టుముట్టు ఉన్న రైతులకు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా బలవంతంగా ఈరోజు సర్వే పూర్తి చేయాలని మొండి పట్టుదలతో కోత్వాల్ గూడ సర్వేనెంబర్ 450,460, చుట్టుపక్కల రైతులు మల్లన్న జాతరలో నిమగ్నమయ్యారు, మరో డేటు కు వాయిదా వేయాలన్నారు. అలా ఎలా కుదురుతుంది అంటూ రైతులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతంగా అధికారులను ఉసిగొల్పి బలవంతపు సర్వే చేయసాగారు. శంషాబాద్ జోన్ పరిధిలోని గ్రామస్తులు, మీడియాకు సమాచారం తెలవడంతో రైతులు గ్రామస్తులు, భారీగా చేరుకొని సర్వేను అడ్డుకున్నారు. ఒక ఎకరా కొనుగోలు చేసి 30 ఎకరాలో రైతులకు ఎలాంటి నోటీసులు, సమాచారం ఇవ్వకుండా అధికారులు ఎలా సర్వే చేస్తారని మీడియా ప్రతినిధులు నిలదీయడంతో సంబంధిత అధికారులు అక్కడినుంచి వెళ్లిపోయారు.

# అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

### పోలీసుల అదుపులో ట్రాక్టర్, డ్రైవర్ డ్రైవర్




**ముందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ ను, డ్రైవర్ ను తన బృందంతో మంగళవారం పట్టుకున్నట్లు ఏఎస్ఐ కె మిలింద్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ స్థానిక ఎస్సై నరేష్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుకను అడ్డుకోవాలన్న ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కాలేజీ, పాలవాగు ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ తనిఖీలలో (సంద్రన్‌పల్లి) నుండి మందమర్రి వైపు వస్తున్న ట్రాక్టర్‌ను అనుమానంతో ఆపినట్లు చెప్పారు. కాగా ఆ వాహనంలో ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించినట్లు స్పష్టం చేశారు. దానితో డ్రైవర్ గట్టు మారుతిని, ట్రాక్టర్ ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభం గడించడం కోసం దొంగ తనంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు నిందితుడు మారుతి అంగీకరించినట్లు ఎస్ఐ మిలింద్ కుమార్ పేర్కొన్నారు.

# పుస్తకాల ఆవిష్కరణ సంబరం



**నిర్మల్ మహా :** నిర్మల్ ఉత్సవాల ముగింపు లో భాగంగా మానస సాహితీసేవా సంస్థ ఆధ్వర్యంలో పలు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం అట్ట హాసంగా జరిగింది. నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి పలు పుస్తకాలను ఆవిష్కరించి రచయితలను అభినందించారు. పరికపల్లి యాదగిరి ,వంగర నరసింహారెడ్డి, కొండి మల్లారెడ్డి రచించిన మూడు పాయలు కథలు, కొండి మల్లారెడ్డి రాసిన గూడు చెదిరిన దృశ్యం, బూర్ల వెంకటేశ్వర్లు రచించిన తలుపుల పుటలు కవిత్వం,మడిపల్లి రాజ్ కుమార్ రాసిన తప్పిపోయిన కాలం , బొల్లారపు బాబన్న రాసిన కొంచెం అయితే వెలుతురే, రణ స్వరం పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. తెలంగాణ సాహిత్య సాంస్కృతిక భాష మూలాలను నలు దిశల వ్యాపించే విధంగా తెలంగాణ సాహిత్యం ముందుకు సాగుతుందని ,ఆ దిశగా కవులు రచయితలు తమ రచన ద్వారా ప్రజా చైతన్యం చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా విద్యాధికారి భోజన్న,మానస సాహితీ సేవాసంస్థ అధ్యక్షులు తుమ్మల దేవరావు , తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు నేరెళ్ల హనుమంతు, కవులు బిక్షపతి నాయక్, అబ్బడి రాజేశ్వర్ రెడ్డి, భీమేష్ తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలోని మున్సిపాలిటీలకు ఎన్నికలు

### రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు.. ఈనెల 30 వరకు నామినేషన్.. జిల్లాలో మొదలైన ఎన్నికల సందడి




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** జిల్లాలోని చేవెళ్ల, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, మొయినాబాద్, షాద్నగర్, శంకర్పల్లి మున్సిపాలిటీలలో ఎన్నికలు జరగనున్నాయి. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్, నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఇసి హెచ్చరించారు.. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమైందని, నేటితో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు, రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపారు. గతవారం క్రితం విడుదల చేసిన రిజర్వేషన్లతో మున్సిపాలిటీలలో ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతుండడంతో, నేడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఎన్నికల వాతావరణ మరింత వేడెక్కింది. ఆశావాహులు తమ తమ ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు పార్టీల నుంచి బి ఫామ్ ఎవరికి వస్తుందని ఆశతో ఆశావాహులు ఉన్నారు. కొందరు స్వతంత్రంగా నైనా పోటీలో ఉండి నెగ్గాలని ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ప్రధాన పార్టీలు కాంగ్రెస్ బిఆర్ఎస్ బిజెపి మధ్య పోటీ బలంగా ఉన్నా' సిపిఐ సిపిఎం బలం ఎటువైపు అనేది, గెలుపు ఎవరిది అనేది వేచి చూడాల్సి ఉంది. మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికలలో ఈ పంథా కొనసాగింది. ఇప్పుడు గెలుపోటములు ఎవరు వంతు అనేది, నేడు బుధవారం నుంచి ఈనెల 30 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని, వచ్చేనెల 11న జరిగే పోలింగ్, 13వ చేపట్టే ఓట్ల లెక్కింపుతో తేలాల్సి ఉంది.



## ఎన్నికల కోసం సర్వం సిద్ధం

**షాద్ నగర్. మహా:** షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని అధికారులు ఏర్పాట్లను సమీక్షించారు. మంగళవారం సాయంత్రం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే మున్సిపాలిటీలో నామినేషన్ల పర్వం కోసం పూర్తి ఏర్పాట్లు చేశారు. కమిషనర్ సునీత రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లను షాద్ నగర్ జోన్ డిసిపి సిహెచ్ శిరీష, ఎసిపి లక్ష్మీ నారాయణ, పట్టణ సీఐ విజయకుమార్ తదితరులు కార్యాలయం వద్ద భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. రేపు ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న నామినేషన్ల పర్వం కోసం కార్యాలయంలో తగిన ఏర్పాట్లు సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి తో డిసిపి శిరీష మాట్లాడారు. కార్యాలయానికి సంబంధించిన అన్ని వివరాలను సేకరించారు. ఇదిలా ఉండగా మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..నామినేషన్ల పర్వం కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తామని తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం ఖాయం




**ఆమనగల్లు, మహా:** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు , ఆమనగల్లు మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీ జంగారెడ్డిపల్లి గ్రామానికిచెందిన బీజేపీ నాయకుడు దుద్దు లక్ష్మయ్య తన అనుచరులతో కలిసి మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఖాదర్ ఖాద్రి ఆధ్వర్యంలో కేశవులు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పారీలో చేరిన వారికి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మాన య్య తో కలిసి కాంగ్రెస్ కండువ కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం కేశవులు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ ,అభివృద్ధి కార్యక్రమాలను చూసి వివిధ పార్టీల నాయకులు ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ తోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని అన్నారు. సామాజిక న్యాయం కాంగ్రెస్ తోనే సాధ్యమన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ఆమనగల్ మున్సిపాలిటీ గణనీయమైన అభివృద్ధి సాధించిందన్నారు.రూ. 63 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు చెప్పారు. 360 మందికి ఇందిరమ్మ ఇల్లు, 520 మందికి రేషన్ కార్డులు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు.రూ.2 కోట్లతో మున్సిపాలిటీ భవనం, రూ.4 కోట్లతో బీసీ వసతిగృహ భవనం ,. రూ 17.50 కోట్లతో ఆసుపత్రి భవనం నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి కాంగ్రెస్ తోనే సాధ్యమని కేశవులు. మానయ్య , ఖాదర్ లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అవ్వారి శివలింగం. కాలే మల్లయ్య మైసయ్య, శ్రీనివాస్ డి, శ్రీను నాయక్, రమేశ్. శేఖర్, కొండల్ రెడ్డి, సాయిలు.నేనావత్ రమేశ్, జైపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్ నగర్ కుమ్మరి సంఘం అధ్యక్షునిగా కుమ్మరి వినోద్ కుమార్



**మొయినాబాద్ మహా:** హిమాయత్ నగర్ గ్రామ శాలివాహన కుమ్మరి సంఘం అధ్యక్షునిగా కుమ్మరి వినోద్ ను ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ లో ఉన్న శాలివాహన కుమ్మరి కులస్తులు సమావేశమై కుమ్మరి వినోద్ కుమార్ ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షుడిగా కుమ్మరి శివకుమార్ ఎన్నుకున్నారు. కుమ్మరి సంఘం అభివృద్ధి కోసం అందరం ఏకతాటిపై ఉండాలని ఈ సందర్భంగా శాలివాహన కుమ్మరి సంఘం సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శాలివాహన కుమ్మరి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## నర్సప్పగూడ ఉప సర్పంచ్ కు ఘన సన్మానం

### కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్

**షాద్ నగర్. మహా:** నందిగామ మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామంలో మంగళవారం నాడు నూతనంగా ఎన్నికైన గ్రామ ఉప సర్పంచ్ అప్పల సిద్ధయ్యను తన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించిన కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ రావు అలాగే కార్మిక సంఘం, డైరీ క్యాలెండర్ ను అందజేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ.... రాజకీయాలకు అతీతంగా గ్రామంలో మౌలిక వసతులు కృషి చేస్తూ ప్రజలు మీ పై పెట్టుకున్న నమ్మకాన్ని నీలా బెట్టుకోవాలి అలాగే గ్రామ అభివృద్ధి కొరకు పాటుపడాలని సూచించడం జరిగింది.

# కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలోని పాత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, నామినేషన్, డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ కేంద్రాలను లక్షెట్టిపేట మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం నామినేషన్ ప్రక్రియ, పోలింగ్, కౌంటింగ్ గదులను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి నిర్వహించాలని వెల్లడించారు. జిల్లాలో మంచిర్యాల కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని అన్నారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో చేపట్టిన పోస్ట్ మార్టం కేంద్రం నిర్మాణ పనులను తెలంగాణ వైద్య విధాన పరిషత్ అధికారి కోటేశ్వర్ తో కలిసి పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, ఓ. పి., రిజిస్టర్లు, పారిశుద్ధ్య పనుల నిర్వహణ ను పరిశీలించారు. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని, పారిశుద్ధ్య నిర్వహణ పక్క బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెను
# విజయవంతం చేయండి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపు



**రాజేంద్రనగర్, మహా ;** నాలుగు లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సార్వత్రిక కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు . సిఐటియు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కవిత పిలుపునిచ్చారు. శంషాబాద్ జోన్ పరిధిలోని హోటల్ ఎలైట్ లో మంగళవారం సిఐటియు నాయకులు పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను, నాలుగు కోడ్ లోకి మార్చి చట్టాలను నిర్వీర్యం చేశారు. వాటిని వ్యతిరేకిస్తూ దేశంలోని అఖిలభారత కార్మిక సంఘాలు అన్ని కలిసి ఐక్యంగా ఈ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని ఆయన తెలిపారు. వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చి వ్యవసాయ రైతులు తీవ్రంగా దెబ్బతీసిన మోడీ ప్రభుత్వంలో విద్యుత్తు నూతన చట్టాలతో వినియోగదారుల పై ప్రజలపై తీవ్రమైన భారాలు మోపడాని ఏఐటియు, సిఐటియు సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నమన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతున్న అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. దేశంలో కార్పొరేటు పెట్టుబడిదారుల దోపిడీ అధికమైందని అన్నారు. ఫిబ్రవరి 12న తుక్కుగూడలో కార్మిక సంఘాల జిల్లా సదస్సుకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు కే రంగస్వామి, సిఐటియు జిల్లా అధ్యక్షులు రుద్రకుమార్, ఏఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్, సిపిఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి ఆశీర్వాదం ప్రతి ఒక్కరిపై ఉండాలి

### దేవాలయ కమిటీ సభ్యులు

**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ ఉప్పర్ పల్లి లోని జనచైతన్య కాలనీ ఫేస్ 1 మహాలక్ష్మి రెసిడెన్స్ ల్ ప్రాంతంలో అభయ ఆంజనేయ స్వామి దేవాలయ సన్నిధిలో వెలసిన శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అమ్మవారికి రెండు రోజులుగా ధర్మకర్తల ఆధ్వర్యంలో పూజలు ఘనంగా నిర్వహించారు.మంగళవారం తెల్లవారుజామున తల్లికి పంచామృత అభిషేకం అలంకరణ కార్యక్రమం నిర్వహించారు. పెద్దమ్మతల్లి భక్తుల కోరుకున్న కోరికలను నెరవేరుస్తుందని నమ్మకం భక్తుల్లో ఉంది. ప్రతి శనివారం దేవాలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. పూజా కార్యక్రమంలో దేవాలయ ధర్మ కర్తల సభ్యులు తుంగ రాంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, సుమన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఇంద్రా రెడ్డి, సికిందర్ రెడ్డి, మహా లక్ష్మి రెసిడెన్స్ కాలని లోని ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# వలసలు ఆగాలంటే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించాలి..!

- **ప్రాణాలతో వలసలు వెళ్లి తిరిగి శవాలై వస్తున్నారు.!**
- **ప్రభుత్వాలు అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నాయి ఇది మానుకోవాలి.!**
- **రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే లక్ష్మీదేవిపల్లి నిర్మించలేకపోతున్నారు..!**
- **ప్రజా సంఘాల పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో నిజా నిర్ధారణ..!**



**షాద్ నగర్. మహా:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని చౌదర్ గూడ మండల శివారు ప్రాంతాలలో గిరిజనులు తమ ప్రాంతాలను వదిలి మహారాష్ట్ర ముంబై హైదరాబాద్ నగరం లాంటి ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని బ్రతుకు దేరువు కోసం వలసలు వెళ్లి ప్రమాదాలు చోటుచేసుకోని ప్రాణాలు కోల్పోతున్నారని ఇక్కడ స్థానిక రైతాంగానికి లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి సాగు త్రాగునీరు అందిస్తే తప్ప వలసలు ఆగవని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి ప్రజాసంఘాల నాయకులు టీజీ. శ్రీనివాస్ (తెలంగాణ విద్యావంతుల వేదిక)అర్జునప్ప( తెలంగాణ ప్రజా ఫ్రంట్) తిరుమలయ్య (పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహయ కారదర్శి) రవీంద్రనాథ్ పాలమూరు అధ్యయన వేదిక నర్సింలు రామచందర్ తదితరులు చౌదర్ గూడ మండల పరిధిలోని చెగిరెడ్డి ఘనపూర్ ఉమ్మడి గ్రామపంచాయతీలైన పరిధిలోని వేపకుచ్చతండా చింతకుంట తండాల్లో పర్యటించి నిజానిర్ధారణ చేసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన తండాలలో దయనీయ దుస్థితులు ఉన్నాయని సుమారు ఒక్కో తండాలో 80, 90,కుటుంబాలు ఉంటే అందులో నుండి 60,70, కుటుంబాలు మహారాష్ట్ర పూణే ముంబై వలసలు వెళ్లారని ఎంతో కొంత భూమి ఉన్న సాగు చేసుకోవడానికి సాగునీరు లేకనే వలసలు వెళ్తున్నారని ఎన్ని బోర్లు వేసిన చుక్క నీరు రాకపోవడంతో వలసలు వెళ్తున్నారని ఈ వలసలు నివారించాలంటే ఇక్కడ స్థానికంగా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించాలని గత పాలకులు ఈ ప్రాంత రైతులను మోసం చేశారని ప్రస్తుత ప్రభుత్వం కూడా అలాగే మోసం చేస్తుందని రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించలేకపోతున్నారని ఇప్పటివరకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి రెండేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మొదటి ప్రియార్టీ ఇవ్వలేదని ఇక్కడ జరిగిన మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ప్రజల జీవితాలతో ప్రభుత్వాలు ఆడుకోవద్దని ఇక్కడ రైతులకు నీళ్లు ఇవ్వకుండా ప్రజలను చంపుతున్నారని లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం తీసుకుంటమని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అమనగల్లు మున్సిపాలిటీలో రిజర్వేషన్ జనరల్

## త్రిముఖ పోరు

### జనరల్ స్థానాల్లో ఎక్కువ ఆశావహులు

**ఆమనగల్లు, మహా:** మున్సిపల్ ఎన్నికలు 2026లో భాగంగా మున్సిపల్ కౌన్సిలర్లుగా పోటీ చేసే అభ్యర్థులు ప్రచారాలు మొదలుపెట్టారు. గతంలో పోటీచేసిన తాజామాజీ కౌన్సిలర్లతో పాటు, ఓడిపోయినవారు, కొత్త అభ్యర్థులు, యువత కౌన్సిలర్ పదవులు దక్కించుకోవాలని ఎదురుచూస్తున్నారు. అందులో భాగంగా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 15 వార్డుల రిజర్వేషన్ ఖరారు కావడంతో క్షేత్రస్థాయిలో అభ్యర్థులు తమ బలాబలాలను అంచనా వేసుకుంటున్నారు. మున్సిపాలిటీగా ఏర్పాటు ఆమనగల్లు మేజర్ గ్రామ పంచాయతీని రాష్ట్ర ప్రభుత్వం 2018 ఆగస్టు 2న మున్సిపాలిటీగా ఏర్పాటు చేసింది. దీంతో పాటు విఠాయిపల్లి గ్రామాన్ని మున్సిపాలిటీలో కలిపారు. ఆమనగల్లు, జంగారెడ్డిపల్లి, విఠాయిపల్లి, ముర్తుజపల్లి,సంకటోనిపల్లి,సాకిబండతండా, నుచ్చుగుట్టతండా, చంద్రాయణపల్లి తండాలతో మున్సిపాలిటీ విస్తరించింది. 2020లో 14,785 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 16,984 మందికి పెరిగారు. గత ఎన్నికల్లో బీజేపీ మెజార్టీ సీట్లు సాధించి చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను దక్కించుకుంది. మొత్తం 15 వార్డులున్న ఆ మున్సిపాలిటీలో బీజేపీ 12 స్థానాల్లో గెలుపొందగా ఇండిపెండెంట్లు ఒక్క స్థానంలో గెలిచారు.

**పిఠాన్ని దక్కించుకోవడానికి ఎత్తుగడ్డలు**

మెజార్టీ కౌన్సిలర్లు గెలుపొంది చైర్మన్ పీఠాన్ని దక్కించుకోవడానికి ప్రధాన మూడు పార్టీలు ఎత్తుగడలు వేస్తున్నాయి. ఆమనగల్లు మున్సిపాలిటీలో త్రిముఖ పోరు కనిపిస్తుంది. అధికార కాంగ్రెస్తో పాటు బీజేపీ, బీఆర్ఎస్లు పోరులో నిలవనున్నాయి. బీజేపీ ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించి వార్డుల వారీగా కొందరు నాయకులకు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తుంది. వారు ఇంటింటికీ తిరుగుతూ బీజేపీకి ప్రచారం నిర్వహిస్తున్నారు. కాగా బీఆర్ఎస్ నాయకులు తమకు బరిలో నిలవలకున్నా వివిధ వార్డుల్లో తిరుగుతూ ప్రజలను కలుసుకుంటున్నారు. అయితే అధికార పార్టీ అయిన కాంగ్రెస్లో మాత్రం ఎన్నికల హడావుడి కనిపించడం లేదు. ఈ సారి ఆమనగల్లు మున్సిపాలిటీని దక్కించుకుని తీరుతామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. చైర్మన్ పదవి కోసం పెద్ద నాయకులు పోటీ పడుతుండటంతో ఈసారి పోరు రసవత్తరంగా జరిగే అవకాశం ఉంది.

**ఎన్నికలకు సై అంటున్న ప్రధాన పార్టీలు..**

గెలుపే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తగిన వ్యూహంతో అభ్యర్థులను పూర్తిగా మార్చే ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎలాగైనా ఈసారి మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు మొదలుపెట్టారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరికి వారే తమ వర్గాలతో తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లని కాంగ్రెస్ నాయకులు.. పది సంవత్సరాల అనంతరం అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు పూర్తిగా విఫలమయ్యారని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు.

**కేసీఆర్ పాలననే నమ్ముకున్న బీఆర్ఎస్..**

రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత మున్సిపాలిటీలో బీఆర్ఎస్ నాయకులు పూర్తిగా సైలెంట్ అయిపోయారు.మున్సిపాలిటీలో బలమైన క్యాడర్ కలిగిన బీఆర్ఎస్ పార్టీ బలమైన అభ్యర్థులను నిలబెట్టి చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు అధిష్టానం ప్రత్యేక దృష్టి సాధించాలని బీఆర్ఎస్ నాయకులు చర్చిస్తున్నారు.

**మరోసారి కమలం మళ్లీ వికసించేలా..**

మున్సిపాలిటీలో కమలాన్ని మళ్లీ వికసింపజేసేలా జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి పైనే ఎక్కువ ఆశలు పెట్టుకున్నారు. మున్సిపాలిటీలో ఇతరపార్టీలకన్నా బలమైన క్యాడర్ బీజేపీకి ఉంది. మరోసారి 15వ వార్డుల్లో మెజారిటీ స్థానాలు కైవసం చేసుకునేలా అభ్యర్థులను నియమించి మరోసారి జెండా ఎగరవేస్తామని బీజేపీ కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. బీజేపీకి చైర్మన్ పీఠం దక్కకుండా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఎలాంటి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తారో మున్సిపల్ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**ఆమనగల్లు మున్సిపాలిటీ: 15వార్డుల వివరాలు.....**

ఆమనగల్లు చైర్మన్ జనరల్...

వార్డు నం. వార్డు పేరు

1 చంద్రాయన్ పల్లి తండా (జనరల్ మహిళ)
2 ముర్తుజపల్లి( ఎస్సీ మహిళ )
3 నుచ్చుగుట్ట తండా( జనరల్ మహిళ)
4 జంగారెడ్డిపల్లి( జనరల్)
5 ఎస్సీ కాలనీ జనరల్
6 సాయి నగర్ (గుర్రం గుట్ట) ఎస్టి
7 వెంకటేశ్వర కాలనీ (ఎస్టి)
8 బీసీ కాలనీ (ఎస్సీ జనరల్)
9 విద్యానగర్ కాలనీ( జనరల్)
10 విఠాయిపల్లి( జనరల్ మహిళ )
11 ఆదర్శనగర్ కాలనీ (ఎస్టి మహిళ)
12 శాంతినగర్ కాలనీ (బిసి జనరల్)
13 శ్రీనివాస కాలనీ (ఎస్టి మహిళ)
14 అంబేద్కర్ నగర్,ప్రేమ్ నగర్ (జనరల్)
15 శివాలయం (జనరల్ మహిళ)

ఆమనగల్లు మున్సిపాలిటీలో మొత్తం 16,984 మంది ఓటర్లు

**వార్డుల ల వారీగా ఓటర్లు...**

1వ వార్డు 1083, 2వ వార్డు 1016, 3వ వార్డు 1718, 4వ వార్డు 1478, 5వ వార్డు 1188, 6వ వార్డు 1863, 7వ వార్డు 1000, 8వ వార్డు 1169, 9వ వార్డు 1000, 10వ వార్డు 1379, 11వ వార్డు 1423, 12వ వార్డు 1122, 13వ వార్డు 1215, 14వ వార్డు 955, 15వ వార్డు 1091.

ANN తెలుగు

మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్
28-01-2026

మేడారం ప్రత్యేకం





# నేటి నుంచి మేడారం మహాజాతర..

## సర్వం సిద్ధం

- **జాతర ఘనంగా నిర్వహించేందుకు సర్కారు పకడ్బందీ ఏర్పాట్లు..**
- **తరలి రానున్న కోట్లాదిమంది భక్తులు..**
- **ఒకేసారి అమ్మవార్లను 10,000 మంది దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు..**
- **25 మంది ఐపీఎస్ లతో భారీ బందోబస్తు.. 13000 మంది సిబ్బంది విధులు..**
- **మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది సిబ్బంది విధులు..**

నేటి నుంచి మేడారం మహాజాతర ప్రారంభం కాబోతోంది. జాతరను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాట్లు చేపట్టింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల నుంచి భక్తులు తరలి రాబోతున్నారు. ఈ మహా జాతరకు 2 కోట్ల మందికి పైగా భక్తులు వస్తారని అధికారుల అంచనా వేస్తున్నారు. దీనికి తగ్గట్లుగా ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. అనేక మంది నెలరోజుల ముందు నుంచే గద్దెల వద్ద మొక్కులు చెల్లిస్తున్నారు. ఇప్పటికే 30 లక్షల మందికి పైగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నట్లు సమాచారం. నేటి నుంచి ప్రారంభమయ్యే మహాజాతరకు భద్రత, రద్దీ నియంత్రణ తదితర అంశాలకు ప్రాధాన్యమిచ్చి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు అధికారులు.

**నేడు సారలమ్మ, రేపు సమ్మక్క రాక..**

జనవరి 28న సారలమ్మ, జనవరి 29న సమ్మక్క గద్దెల పైకి చేరుకుంటారు. జనవరి 30న భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. జనవరి 31న దేవతలు వనప్రవేశంతో జాతర ముగుస్తుంది. అయితే జాతర ప్రారంభానికి ముందే భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. దీంతో మేడారం వెళ్లే దారులన్నీ రద్దీగా మారాయి.

**పకడ్బందీగా ఏర్పాట్లు..**

జాతర విధుల్లో పోలీసు శాఖది కీలక పాత్ర. ఈ జాతర ముగిసే వరకు 25 మంది ఐపీఎస్ ల పర్యవేక్షణలో 13 వేల మంది సిబ్బంది పని చేయనున్నారు. ఐజీ చంద్రశేఖర్రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ సీపీ, రామగుండం సీపీ పర్యవేక్షణలో గద్దెలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, జాతర కోర్ ఏరియాలో భక్తుల రద్దీ నియంత్రణ విభాగాలు పని చేసేలా కసరత్తు చేశారు. అలాగే జాతరలో పాత నేరస్తుల సంచారం, తప్పిపోయిన వారి గుర్తింపు, దర్శన సందర్భంలో రద్దీ, ట్రాఫిక్ సమస్యలను గుర్తించేలా అధునాతన టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. వీటన్నింటి కోసం 20 డ్రోన్ కెమెరాలు, 450 సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంతో అనుసంధానించి నిఘా ఉంచుతున్నారు.

**సౌకర్యాలు ఇలా..**

ఇక్కడ గతంలో ఏకకాలంలో అమ్మవార్ల గద్దెలను 2000 మంది దర్శించుకుంటే ప్రాంగణం రద్దీగా మారేది. కానీ ఇప్పుడు ప్రాంగణం విస్తరణతో ఒకేసారి 89 వేల మంది దర్శించుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. గతంలో సమ్మక్కసారలమ్మ గద్దెల పక్కన పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలుండేవి. భక్తులు ఆ ప్రాంగణం లోపల వెనక్కి ముందుకు తిరిగేవారు. పునర్నిర్మాణంతో గద్దెలన్నీ ఒకే వరుసలోకి రావడంతో ఆ సమస్య రాదని చెబుతున్నారు. జాతరలో భక్తుల రద్దీ అనుగుణంగా ప్రైవేటు వాహనాలకు ఊరట్టం గ్రామం వద్ద 33 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. అలాగే గద్దెలకు సమీపంలోనే ఆర్టీసీ బస్టాండ్, వీఐపీ వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఉంటుంది. జాతర తేదీల్లో 3 లక్షల వాహనాలొచ్చినా నిలిపేందుకు సుమారుగా 2 వేల ఎకరాల స్థలాన్ని సిద్ధం చేశారు. గత సంవత్సరం కంటే ఈ సారి 500 బస్సులు పెంచనున్నారు. మహిళలకు ఆధార్ గుర్తింపుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుంది. మొబైల్ సిగ్నల్ కోసం బీఎస్ఎన్ఎల్ 10 తాత్కాలిక టవర్లను ఏర్పాటు చేసింది. మేడారం మహాజాతరకు చేరుకొనే మార్గంలో 39 చోట్ల రహదారులను అభివృద్ధి చేశారు. అంతేకాదు తాడ్వాయి, పస్రా, బయ్యక్కపేట మార్గాల్లో ఇరుకు రోడ్లను విస్తరించారు. మేడారంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించారు. జంపన్న వాగు వద్ద ఏర్పాట్లను ఆధునికీకరించారు. మేడారంలోని రెండు 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాల సామర్థ్యాన్ని పెంచారు. నార్లాపూర్ వద్ద మరో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మించారు. విద్యుత్త్ కోసం 259 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. జంపన్నవాగుపై నుంచి వెళ్లే లైన్ల కోసం ఎత్తయిన టవర్లను కూడా నిర్మించారు.

**జిల్లాల వారీగా రూట్ మ్యాప్..**

- ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, మెదక్, వరంగల్ ప్రాంతాల వారంతా ములుగు, పస్రా మీదుగా రావాలి.
- ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల వాసులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, తాడ్వాయి మండలం కాల్వపల్లి మీదుగా మేడారం సమీప ఊరట్టం స్థూపం వద్దకు చేరుకోవాలి.
- మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్, ఆంధ్రప్రదేశ్ సహా భద్రాద్రి కొత్తగూడెం నుంచి వచ్చే వారు ఏటూరునాగారం వైపు నుంచి కొండాయి మీదుగా వెళ్లాలి.
- ఇక తిరుగు ప్రయాణంలో వరంగల్ వైపు వెళ్లే వాహనాలు ములుగు మీదుగా కాకుండా బయ్యక్కపేట మీదుగా భూపాలపల్లి వైపు నుంచి మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

**మహాజాతరకు విస్తృత ఏర్పాట్లు..**

- మేడారం జాతర కోసం మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు. 2 వేల మంది ఆదివాసీ వలంటీర్లు విధుల్లో ఉంటారు.
- 27 శాశ్వత, 33 తాత్కాలిక మొబైల్ టవర్స్ ఏర్పాటు చేశారు.
- 1418 ఎకరాల్లో 42 పార్కింగ్ కేంద్రాలను ఏర్పాట్లు చేశారు.
- 4 వేల ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తాయి.10,441 మంది ఆర్టీసీ సిబ్బంది విధుల్లో ఉంటారు.
- 5,482 తాగు నీటి పాయింట్లు ఉంటాయి.
- జంపన్న వాగు వద్ద 119 డ్రెసింగ్ రూమ్స్ ఏర్పాటు
- 5,700 టాయిలెట్స్ ఏర్పాటు చేయగా... 5,000 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉంటారు.
- 196 ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయగా... 911 స్తంబాలు ఉంచారు.
- 5,192 మెడికల్ సిబ్బంది విధుల్లో ఉంటారు.








## మేడారంలో 600 హుండీలు


మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో ఈసారి 600 హుండీలను ఏర్పాటు చేస్తున్నారు. గత జాతరలో 470 హుండీలను ఏర్పాటు చేశారు. వనదేవతల గద్దెల ప్రాంగణం పెరగడంతో ఆ మేరకు హుండీల సంఖ్యను పెంచాలనే నిర్ణయాన్ని తీసుకున్నారు. వీటికి పోలీసు శాఖ కూడా అనుమతి ఇచ్చింది. ఇది వరకు సమ్మక్క, సారలమ్మ జాతర గద్దెల ప్రాంగణం చిన్నదిగా ఉండేది. జాతర జరిగిన మూడు రోజులు భక్తులతో క్రిక్కిరిసి పోయేది. దీనితో హుండీలను ఏర్పాటు చేయడానికి చాలినంత స్థలం ఉండేది కాదు. ఈ సారి అలాంటి పరిస్థితి ఉండదు. రూ101 కోట్ల వ్యయంతో తల్లుల గెద్దలను ఆధునీకరించారు. గద్దెల ప్రాంగణాలను గతంలో కన్నా విస్తరించారు. శిలాస్థంభాలతో సుందరీకరించారు. ఈ దృష్ట్యా ఈ సారి హుండీలను 600 వరకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

### క్యూఆర్ కోడ్ ద్వారా..

గత జాతర వరకు భక్తులు తమ కానుకల ను హుండీలో మాత్రమే వేసే అవకాశం ఉం డేది. ఈసారి డిజిటల్ పేమెంట్ల అవకాశం కల్పించారు. జాతర ప్రాంగణంలో క్యూఆర్ కోడ్‌లను అందుబాటులో ఉంచారు. భక్తులు స్కాన్ చేసి తమ కానుకలను నగుదు రూపంలో ఫోన్ ద్వారా చెల్లించవచ్చు. దీంతో సాంప్రదాయిక గిరిజన జాతర ఆధునికతను సంతరించుకున్నట్లయింది









# ఆదిలాబాద్ మున్సిపల్ పీఠం ఎవరిది?




**ఆదిలాబాద్ మహా:** మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. స్టేట్ ఎలక్షన్ కమీషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 11న పోలింగ్, 13న కౌంటింగ్ అనంతరం ఫలితాలు ప్రకటించనున్నట్టు తెలిపింది.అవసరమైన చోట ఫిబ్రవరి 12న రీపోలింగ్ చేపట్టనున్నారు. ఇక రేపు జనవరి 28 బుధవారం నుండి నామినేషన్ల ప్రక్రియ మొదలు కానుంది. ఈనెల 30 నామినేషన్ల సమర్పణకు తుది గడువుగా పేర్కొంది. 30ననే నామినేషన్ల పరిశీలన చేపట్టి అదే రోజున అర్హత గల అభ్యర్థుల వివరాలను ప్రకటించనుంది.తిరస్కరించిన నామినేషన్ల అప్పీల్ కు ఫిబ్రవరి 2 వరకు అవకాశమిచ్చింది. ఫిబ్రవరి 3 న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజున పోటీచేసే అభ్యర్థుల ఫైనల్ లిస్ట్ ప్రకటించనుంది.

**మొత్తం 13**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక కార్పోరేషన్ (మంచిర్యాల)తో పాటు మొత్తం 13 పురపాలికలున్నాయి ఆదిలాబాద్ జిల్లాలో ఆదిలాబాద్ .మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల, బెల్లంపల్లి, క్యాతన్ పల్లి,నస్పూర్, చెన్నూర్ ,లక్షెట్టిపేట్ ,నిర్మల్ జిల్లాలో నిర్మల్ , భైంసా , ఖానాపూర్, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆసిఫాబాద్ , కాగజ్ నగర్ మున్సిపాలిటీలున్నాయి. ఆదిలాబాద్ లో 49 వార్డులు, మంచిర్యాల కార్పొరేషన్ లో 60, నస్పూర్25, చెన్నూర్18, లక్షెట్టిపేట్ 15, క్యాతనపల్లి 22 బెల్లంపల్లి 34 నిర్మల్ 42,భైంసా26, ఖానాపూర్12, ఆసిఫాబాద్20, కాగజ్ నగర్30 వార్డులలో ఎన్నికలు జరగనున్నాయి.అయితే మందమర్రి మున్సిపల్ కి ఈ సారి కూడా ఎన్నికలేదు.

**అభ్యర్థుల్లో టెన్షన్**

మున్సిపల్ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నాయి.ఇప్పటికే ఆయా వార్డులలో ఆశావహుల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిశీలిస్తున్నాయి.వార్డులలో గెలిచే సత్తా ఉన్న అభ్యర్థుల కోసం సర్వేలు నిర్వహించి గెలుపు గుర్రాల వేటలో ఉన్నాయి. ఇంకా టైముందిలే అనుకుంటూ పేర్లను నిదానంగా జల్లెడ పడుతున్న పార్టీలు ఒక స్పీడప్ అయ్యాయి. అయితే ఇంత త్వరగా నోటిఫికేషన్ వస్తుందని భావించని పార్టీలు, అభ్యర్థులు జాబితా తయారీలో ఉరుకులు పరుగులు మొదలు పెట్టారు. దీంతో ఆశావహ అభ్యర్థులలో టెన్షన్ మొదలైంది. మూడు ప్రధాన పార్టీలకు సంబంధించి ప్రతీ బల్దియా పరిధిలో ఒక్కో వార్డు నుండి ఆశావహులు దాదాపు ముగ్గురు నుండి ఐదుగురి వరకు ఉన్నట్టు తెలుస్తోంది. కొన్ని చోట్ల ఆ సంఖ్య ఇంకా అంతకంటే ఎక్కువే అంటుంది. సర్వేల అనంతరం ఆయా పార్టీలు వడపోసిన జాబితాను నేడు ప్రకటించే అవకాశముంది. దీంతో జాబితాలో తమ పేరు ఉంటుందా లేదా అన్న ఆందోళన ఆశావహ అభ్యర్థుల్లో నెలకొంది.

**రెబల్స్ బెడద**

ఒక వేళ తుది జాబితాలో పేరు లేక పోతే ఏంచేయాలన్నఆలోచనను కూడా కొందరు దరఖాస్తు సమర్పించే ముందే ఆలోచించుకున్నట్టు సమాచారం. ఆయా పార్టీలు టికెట్ కేటాయిస్తే ఉత్సాహంతో దూసుకెళ్లడం లేదా ఇంకేదైనా చిన్నా చితకా పార్టీల బీఫాం ఆశించడం. అదీ కాదనుకుంటే అదృష్టం పరీక్షించుకునేందుకు ధైర్యం చేసి సొంతంగా స్వతంత్ర్య అభ్యర్థిగా బరిలో దిగే ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో ప్రతీ పార్టీ నుండి రెబల్స్ పోటీలో ఉంటే పార్టీ టికెట్ పై బీఫాం పొందిన అభ్యర్థులకు తలనొప్పి తప్పక పోవచ్చు. అయితే జిల్లా పార్టీ పెద్దలు రెబల్స్ ని ఎంత వరకు సముదాయించుతారో అన్నది వారి గెలుపోటములను ప్రభావితం చేయనుంది.

**పీఠం కోసం...**

ఇక ఉమ్మడి జిల్లాలో జనరల్ , జనరల్ మహిళ, బీసీ జనరల్ , బీసీ మహిళ ఉన్న బల్దియాలలో ఇప్పటికే చైర్మన్ అభ్యర్థులు ఖరారైనట్టు తెలుస్తోంది. పేర్లు బయటకు రాకపోయినా ఫలానా అనే చర్చ నేటి వరకు జరిగింది. ఇక నామినేషన్ల పర్వం ప్రారంభం కానుండడంతో సస్పెన్స్ కు తెర పడనుంది.అయితే మంచిర్యాల కార్పోరేషన్ తో పాటు మిగతా బల్దియా పీఠాలపై కన్నేసిన పార్టీలు గెలుపు వ్యూహాలు పన్నుతున్నాయి. చైర్మన్ అభ్యర్థులకు వారి గెలుపుతో పాటు మెజార్టీ వార్డు సభ్యుల విజయం కూడా అత్యవసరం. దీంతో భారీ స్థాయిలో ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ప్రధాన పార్టీలు కొంత పార్టీ ఫండ్ కేటాయించినా జేబు నుండి తీయక తప్పదు. దీంతో ఆర్థిక పరిపుష్టి కలిగిన అభ్యర్థులనే చైర్మన్ స్థానానికి ఎంపిక చేసినట్టు సమాచారం.అన్ని పార్టీలలో ఇదే తరహా పరిస్థితి కనబడుతుండడంతో పోటీ రసవత్తరంగా మారనుందని విశ్లేషకుల అంచనా.ఇక పోతే ప్రచారానికి సమయం తక్కువగా ఉండడంతో తన వార్డుతో పాటు అన్ని వార్డులు కవర్ చేసేలా దానికనుగుణంగా ప్రణాళిక రచించుకుంటున్నారు.

**అధికార పార్టీకి అనుకూలం**

స్థానిక సంస్థల ఎన్నికలేవైనా సాధారణంగా అధికార పార్టీకి కాస్తా అనుకూలంగానే ఉంటాయి. ఈ సారి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం లో కొనసాగుతుండటం ఆపార్టీ కి ప్లస్ పాయింట్ కానుంది. అంతే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా పార్టీకి కలిసి రానున్నాయి. ప్రధానంగా మహిళలు ఎక్కువగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే అవకాశముంది. ఉచిత బస్ ప్రయాణం, రెండువందల యూనిట్లవరకు ఉచిత విద్యుత్,ఐదువందలకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్య శ్రీ బీమా పెంపు, ఇందిరమ్మ ఇండ్లు,
మహిళలకు వడ్డీ లేని రుణాలు , ఇందిరా శక్తి పథకం కింద ప్రత్యేక ప్రోత్సాహం,సన్న బియ్యం పంపిణీ లాంటివి మహిళలను అక్కున చేర్చుకునే అంశాలుగా భావించాలి. ప్రభుత్వ ఉద్యోగులు, కొత్తగా ఉద్యోగం పొందిన వారు వివిధ కుల సంఘాలు కూడా అధికార పార్టీకి జై కొట్టే అవకాశముంది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఆ పార్టీ అత్యధిక స్థానాలు గెలిచే అవకాశం కనపడుతోంది. ఏదేమైనా ఓటరు దేవుళ్లు ఎవరిని కనికరిస్తారో ఎవరిని మట్టి కరిపిస్తారో తేలాలంటే ఫిబ్రవరి 13వరకు వెయిట్ చేయక తప్పదు.

# కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు



- **5,10,39 వార్డుల నుండి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు**
- **కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించిన కంది శ్రీనివాస రెడ్డి**
- **మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి**

**ఆదిలాబాద్ మహా :** మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దామని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయం ప్రజాసేవాభవన్ లో జరిగిన చేరికల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 10వ వార్డు నుండి తుమ్మ ధనలక్ష్మీ విశాల్ ఆధ్వర్యంలో 5, 39 వార్డుల నుండి పెద్ద సంఖ్యలో మహిళలు కాంగ్రెస్ లో చేరారు. వారందరికి కండువాలు కప్పి కంది శ్రీనివాస రెడ్డి పార్టీలోకి స్వాగతించారు. మున్సిపల్ ఎన్నికల ముంగిట పార్టీలోకి చేరికలు జరగడం మంచి పరిణామమన్నారు. ఇంత మంది చేరికతో పార్టీ మరింత బలోపేతమయ్యిందన్నారు.. 40 వార్డుల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీ సత్తా ఏంటో ప్రతిపక్షాలకు తెలియచేయాలన్నారు. ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల్లో దాదాపు 60శాతానికి పైగా స్థానాలు గెలుచుకున్నామని అదే ఊపుతో రెట్టించిన ఉత్సాహంతో మున్సిపల్ ఎన్నికల్లో కలిసి పని చేద్దామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రెండు వందల యూనిట్ల వరకు ఉచిత కరెంట్, 500 లకు గ్యాస్ సిలిండర్ ,రేషన్ కార్డులు, సన్నబియ్యం లాంటివెన్నో అందిస్తుందన్నారు. మరొక శుభవార్త అంటూ ప్రతీ మహిళకు నెలకు 2500 రూపాయల పథకం త్వరలో రాబోతుందన్నారు. సీయం రేవంత్ రెడ్డి దీనిని త్వరలో ప్రారంభించబోతున్నారంటూ చెప్పారు.అందుకే ఎన్నో మంచి పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీని ఆదరించాలన్నారు,మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ సంతోష్‌రావు ,వేణుగోపాల్, కోలా నర్సింలు, కొండా గంగాధర్,లోక ప్రవీణ్ రెడ్డి , కలాల శ్రీనివాస్,ఆవుల వెంకన్న,రామ్ కుమార్ , సుధాకర్ గౌడ్, రమేష్, రవీందర్, శంకరయ్య, నరేష్, రాజేశ్వర్, షకీల్, తోఫిక్ తదితరులు పాల్గొన్నారు.

# పాత ఉపాధి చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని తీర్మాణం

**తీర్మాణ కాపీలను కంది శ్రీనివాస రెడ్డికి అందజేత**




**ఆదిలాబాద్, మహా :** పేదల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కావాలనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేరు మార్చిందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి విమర్శించారు.మంగళవారం న్యూ రాంపూర్ సర్పంచ్ గడ్డం వేణుగోపాల్ రెడ్డి ,సుందరగిరి ఉపసర్పంచ్ నిమ్మల గౌతమ్ రెడ్డి తో పాటు కార, మేడిగూడ, సాంగ్వి గ్రామాల ఉప సర్పంచులు వార్డు మెంబర్లు కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. జీరామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొసాగించాలని తమ గ్రామపంచాయితీలలో తీర్మాణం చేసినట్టు వివరించారు.ఆయా గ్రామపంచాయతీ పాలక వర్గాల తీర్మాణ కాపీలను కంది శ్రీనివాస రెడ్డికి అందించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ సంతోష్ రావు ,వేణుగోపాల్, కోలా నర్సింలు, కొండా గంగాధర్,లోక ప్రవీణ్ రెడ్డి , కలాల శ్రీనివాస్,ఆవుల వెంకన్న,రామ్ కుమార్ , సుధాకర్ గౌడ్, రమేష్, రవీందర్, శంకరయ్య, నరేష్, రాజేశ్వర్, షకీల్, తోఫిక్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు..


**కరీంనగర్, మహా:** కరీంనగర్ జిల్లాలో ఒక కార్పొరేషన్, 3 మున్సిపాలిటీలు, 4,31,722 మంది ఓటర్లు కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. మొత్తంగా 140 వార్డులకు 450 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 4,31,722 మంది ఓటర్లు ఉన్నారు. చొప్పదండి:14 వార్డులు16,580 ఓటర్లు ఉన్నారు. కాగా ఫిబ్రవరి 11న పోలింగ్, 13న ఫలితాలు వెలువడనున్నాయి. కరీంనగర్ కార్పొరేషన్: 66 వార్డులు 3,40,580 మంది ఓటర్లు

**జమ్మికుంట: 30 వార్డులు- 38,120 ఓటర్లు**

**హుజూరాబాద్: 30 వార్డులు- 36,442 ఓటర్లు**

**నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ..**

**ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ సి పి**



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లకు, కరీంనగర్ జిల్లా చొప్పదండి మున్సిపాలిటీ పరిధిలోని 14 వార్డులకు, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు, హుజురాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలోకరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నోటిఫికేషన్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని సందర్శించి డివిజన్ల వారీగా నామినేషన్ల స్వీకరణకు ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. అభ్యర్థులు వచ్చే మార్గం వెళ్లే మార్గం వేరువేరుగా ఉండాలని, నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు స్వీకరించాలని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పేర్కొన్నారు.

## హత్యయత్నం కేసులో నిందితునికి 3 సంవత్సరాల శిక్ష

**మందమర్రి, మహా :** మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధి 2018 జూలై 22 నాడు జరిగిన హత్యాయత్న కేసులో నిందితుడు కోహినూరు దక్షిణామూర్తికి న్యాయస్థానం 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు 2 వేల రూపాయల జరిమానా విధించినట్లు మందమర్రి సీఐ పి రమేష్ తెలిపారు. పాత బస్టాండ్ పెట్రోల్ పంపు నివాసి దసుకుంట్ల కుమారస్వామికి డబ్బుల లావాదేవీల విషయంలో దక్షిణామూర్తికి జరిగిన గొడవలో కత్తితో దాడి చేయగా బాధితులకు తీవ్ర గాయాలు అయ్యాయని తెలిపారు. కాగా అప్పటి ఎస్సై పి సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు, అనంతరం చార్జ్ షీట్ దాఖలు చేసినట్లు చెప్పారు. న్యాయస్థానంలో విచారణ జరిపిన అనంతరం నేరం రుజువు అయినట్లు వెల్లడించారు. దానితో సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఏ నిర్మల ఈరోజు తీర్పు వెల్లడించారని అన్నారు. ఈ కేసులో నేరం రుజువు కావడంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్ కీలక పాత్ర పోషించారని వివరించారు. మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ ఏ రవికుమార్, మందమర్రి సీఐ పి రమేష్, ఎస్ఐ జి నరేష్, కోర్ట్ కానిస్టేబుల్ ఇ సురేందర్, లైజన్ ఆఫీసర్లు సి హెచ్. వెంకటేశ్వర్లు, తదితరులు సమర్థవంతంగా సహకరించినదుగ్గాను వారిని రామగుండం డీఐజీ అంబర్ కిషోర్ ఝా ప్రాసిక్యూషన్ బృందాన్ని అభినందించారు.

# విద్యార్థుల కొరకు ప్రత్యేక ప్రేరణ తరగతులు

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య**




**మంచిర్యాల, మహా :** జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణ అవగాహన తరగతులు నిర్వహిస్తున్నామని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులముల వసతి గృహంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక తరగతులకు మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాధికారి ఎస్ యాదయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శంకర్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి భాగ్యవతి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని షెడ్యూల్డ్ కులముల సంక్షేమ వసతి గృహాలలో చదువుచున్న 10 వ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక ప్రేరణఅవగాహన తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, ఇష్టంతో చదివి, పట్టుదలతో ఉన్నత స్థానాలలో నిలవాలని వివరించారు. అందరు విద్యార్థులు ప్రేరణఅవగాహన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో నిపుణులైన ఉపాధ్యాయులు మంచి మెలకువలను చూపిస్తూ బోధించిన దృశ్య అన్ని సబ్జెక్టులలో 100 శాతం మార్కులు సాధించాలని, వార్షిక ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆయన కోరారు. తద్వారా మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ధర్మానంద్ గౌడ్, ఉపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రీనరి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయండి

**నగర మేయర్ గుండు సుధారాణి**

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలోని పార్కు లలో గ్రీనరీ ఏర్పాటు కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ ఛాంబర్ లో హార్టికల్చర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పాల్గొని సమర్థవంతంగా చేపట్టుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర పరిధిలోని గ్రాండ్ ఎంట్రెన్స్ (ముఖ ద్వారాలు) ప్రాంతాలలో గ్రీనరీ ఏర్పాటు తో పాటు సమర్థవంతంగా నిరంతరం పచ్చదనం ఉట్టిపడేలా నిర్వహణ కొనసాగాలని, రాబోవు వన మహోత్సవాన్ని దృష్టి లో ఉంచుకొని అందుకు అనుగుణం గా నర్సరీల్లో మొక్కలను పెంచాల్సిన అవసరం ఉందని ఇందుకోసం బల్దియా నిర్వహిస్తున్న నర్సరీల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిశీలన జరిపి అందుకు అనుగుణం గా మొక్కలు పెంచేలా చూస్తామని,నగరం లో పార్కులను అభివృద్ధి చేయడానికి డబ్ల్యు ఆర్ ఐ వారు అభివృద్ధి చేసి అందజేసిన డిజైన్ల కు అనుగుణం గా వరంగల్ పరిధి లోని సుందరయ్య నగర్ తో పాటు క్రిస్టియన్ కాలనీ ప్రాంతాల్లో గల పార్కు లలో పాటు హన్మకొండ పరిధి లోని బాల సముద్రం లో గల చిల్డ్రెన్స్ పార్క్ లో ఇంజనీరింగ్ సంబంధిత అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కావున ఇదే క్రమం లో అట్టి పార్క్ యందు గ్రీనరీ కోణంలో అందుకు అనుగుణంగా ఇంజినీరింగ్ అధికారుల సహకారంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ రమేష్ హెచ్ ఓ లక్ష్మారెడ్డి హార్టికల్చర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేటుకు ధీటుగా ప్రభుత్వ బడి..

- **దేశంలో ఎక్కడ లేని విధంగా బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాల**
- **రూ. ప్రతీక్ ఫౌండషన్ నిధులు 8 కోట్లతో సకల హంగులతో ప్రభుత్వ బడిని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి..**
- **వాల్డార్ఫ్ విద్యా విధానం సృజనాత్మకతకు ఊపిరి..**
- **విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్‌లుగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం..**




**నల్గొండ మహా:** "పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలన్నది నా చిరకాల కోరిక. చదువుతోనే సామాజిక మార్పు, అభివృద్ధి సాధ్యమని నేను బలంగా నమ్ముతున్నాను. అందుకే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, అంతర్జాతీయ ప్రమాణాలతో బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దాం" అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.నల్గొండ పట్టణంలోని ప్రకాశం బజార్లో బొట్టుగూడ ప్రభుత్వ బడిని ప్రతీక్ ఫౌండేషన్ సమకూర్చిన రూ. 8 కోట్ల నిధులతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాఠశాల ప్రత్యేకతలను, తన ఆశయాలను వివరించారు.

**వాల్డార్ఫ్ విద్యా విధానం.. సృజనాత్మకతకు ఊపిరి**

ప్రస్తుత విద్యా విధానం కేవలం ర్యాంకులు, మార్కుల చుట్టూ తిరుగుతూ పిల్లలపై ఒత్తిడి పెంచుతోందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి భిన్నంగా 'వాల్డార్ఫ్' (Waldorf) విద్యా విధానం నుంచి ప్రేరణ పొంది, విద్యార్థుల్లో ఆలోచన, భావన, కార్యాచరణను పెంపొందించేలా ఈ పాఠశాలను రూపొందించినట్లు తెలిపారు. అనుభవాత్మక విద్యతో కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రకృతితో మమేకమయ్యేలా తోటపని, మట్టికుండల తయారీ, రాయి చెక్కుదల వంటి నైపుణ్యాలను ఇక్కడ నేర్పిస్తారు.యోగా, నృత్యం, ఇండోర్ క్రీడల ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని అందించనున్నారు.సుమారు 2500 గజాల స్థలంలో నిర్మించిన ఈ పాఠశాలలో ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా సౌకర్యాలు కల్పించారు.45 అత్యాధునిక కంప్యూటర్లతో కూడిన ల్యాబ్, పూర్తిగా డిజిటల్ తరగతి గదులు, స్టెమ్ (STEM) విద్యా విధానాన్ని విద్యార్థులకి అందుబాటులోకి తీసుకోచ్చమని మంత్రి తెలిపారు. ప్రతి తరగతి గదిలో ఏసీ సదుపాయం, విద్యార్థుల కోసం లిఫ్ట్, విశాలమైన గ్రంథాలయం, స్మార్ట్ లెర్నింగ్ టూల్స్ ఏర్పాటు చేశారు. పాత సిలబస్‌తో పాటు సీబీఎస్ఈ (CBSE) విధానాన్ని కూడా ప్రవేశపెట్టి, విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీకి సిద్ధం చేస్తామని మంత్రి ప్రకటించారు.

**ఈ ప్రభుత్వం పాఠశాల 'దేశానికే ఆదర్శం'**

"దేశంలోనే ఇలాంటి ప్రభుత్వ పాఠశాల మరొకటి ఉండదు. ఇక్కడ చదివిన విద్యార్థులు భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్, శాస్త్రవేత్తలుగా ఎదగాలి. విద్యార్థుల సంఖ్యను బట్టి అవసరమైతే మరిన్ని భవనాలు నిర్మిస్తాం" అని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. పేదవాడి చదువు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, లైబ్రరీ చైర్మన్ ఆఫీజ్ ఖాన్, అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

**ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి :ఎమ్మెల్యే వేముల వీరేశం పిలుపు..**

**నకిరేకల్ మహా :**"దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా, సమాజంలో ఆత్మగౌరవంతో బతకాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వారి అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది" అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా మంజూరైన త్రిచక్ర మోటార్ వాహనాలు (స్కూటీలు), ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ.. దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికి, విద్యా ప్రోత్సాహానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. ల్యాప్‌టాప్‌లు, స్కూటీల వంటి పరికరాలు దివ్యాంగులకు రవాణా ఇబ్బందులను తొలగించడమే కాకుండా, ఉపాధి మార్గాలను మెరుగుపరుచుకునేందుకు తోడ్పడతాయని పేర్కొన్నారు. ఏ ఒక్క అర్హుడూ సంక్షేమ ఫలాలకు దూరం కాకుండా చూస్తామని, దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు."దివ్యాంగులు వైకల్యాన్ని అడ్డంకిగా భావించవద్దని ప్రభుత్వం అందించే ఈ సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. వారి సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా వాహనాలు అందుకున్న లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే వీరేశం కి ధన్యవాదాలు తెలిపారు.

# నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ ఏటీఎం

- **రూ. 30 లక్షలతో ఆధునిక వైద్య పరికరాలు.. ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి..**
- **నిమిషాల్లోనే ఆరోగ్య పరీక్షల ఫలితాలు పేదలకు వరం..**




**నల్గొండ, మహా:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు వైద్య సేవలను మరింత చేరువ చేస్తూ, రోగ నిర్ధారణ పరీక్షలను వేగవంతం చేసేందుకు అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలోని క్రిటికల్ కేర్ విభాగంలో రూ. 30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన హెల్త్ ఏటీఎం (ప్రైమ్ కేర్ మిషన్), ఈసీజీ మిషన్‌ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి ప్రజలు ఖరీదైన ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే అవసరం లేకుండా, ప్రభుత్వ ఆసుపత్రిలోనే తక్షణ రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించేలా ఈ యంత్రాలను సమకూర్చినట్లు చెప్పారు.హెల్త్ ఏటీఎం ద్వారా రోగులకు తక్కువ సమయంలోనే నాణ్యమైన పరీక్షలు నిర్వహిస్తారని మంత్రి వివరించారు.ఈ యంత్రం ద్వారా ఈసీజీ, రక్తపోటు (బీపీ), రక్తంలో చక్కెర స్థాయి (షుగర్), పల్స్ రేటు, శరీర ఉష్ణోగ్రత, ఆక్సిజన్ స్థాయి (సాచ్యురేషన్) వంటి కీలక పరీక్షలను తక్షణమే చేసుకోవచ్చని, వైద్య చికిత్స ల పరీక్షల ఫలితాలు వెంటనే డిజిటల్ రూపంలో లభించడం వల్ల వైద్యులు వ్యాధి తీవ్రతను త్వరగా గుర్తించి, సరైన చికిత్స అందించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

**కంటి సమస్యల గుర్తింపునకు ప్రత్యేక మిషన్..**

ప్రైమ్ కేర్ మిషన్‌లో భాగంగానే గ్లూకోమా, రెటీనా దెబ్బతిన్న తీరును గుర్తించేందుకు అధునాతన కంటి పరీక్షల సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు. హృదయ సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడంలో ఈసీజీ మిషన్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జిల్లాలోని మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ నరసింహారావు నేత, వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉమ్మడి నల్గొండలో పురపోరు..

## నేటి నుంచే నామినేషన్ల పర్వం!

17 మున్సిపాలిటీలు.. 6.70 లక్షల మంది ఓటర్లు,అభ్యర్థుల ఖరారుపై పార్టీల కుస్తీ..
గెలుపు గుర్రాల కోసం అన్వేషణ
కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య హోరాహోరీ..
అక్కడక్కడ కమలం, వామపక్షాల ప్రభావం..

**నల్గొండ మహా ప్రతినిధి :** ఉమ్మడి నల్గొండ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. నోటిఫికేషన్ విడుదల కావడంతో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బుధవారం నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుండటంతో ఆశావహుల హడావుడి మొదలైంది. నామినేషన్లకు గడువు కేవలం మూడు రోజులే ఉండటంతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రధాన పార్టీలకు సవాలుగా మారింది. జిల్లాలో నల్గొండ కార్పొరేషన్‌తో పాటు మొత్తం 17 మున్సిపాలిటీలకు (నకిరేకల్ మినహా) ఎన్నికలు జరగనున్నాయి.

**పార్టీ గుర్తుపై పోరు.. ప్రతిష్ఠాత్మకం..**

గ్రామ పంచాయతీ ఎన్నికల వలె కాకుండా, మున్సిపల్ ఎన్నికలు పార్టీ గుర్తుపై జరుగుతుండటంతో ప్రధాన పార్టీలు దీనిని అగ్నిపరీక్షగా భావిస్తున్నాయి.అధికార కాంగ్రెస్ పార్టీ జిల్లాలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉంది. అయితే, టికెట్ల కోసం పోటీ ఎక్కువగా ఉండటంతో రెబెల్స్ భయం పార్టీని కలవరపెడుతోంది. బీఆర్ఎస్ పార్టీ




పంచాయతీ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో గట్టి పోటీనిచ్చి పుంజుకున్న బీఆర్ఎస్, మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటి పూర్వ వైభవం సంపాదించాలని చూస్తోంది. మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు ఇప్పటికే క్షేత్రస్థాయిలో వ్యూహాలకు పదును పెడుతున్నారు. కొన్ని వార్డుల్లో బీజేపీ, సీపీఎం తమదైన ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**ఓటర్ల లెక్కల్లో మహిళలదే పైచేయి..**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 162 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటిలో సగానికి పైగా సీట్లను మహిళలకు కేటాయించారు.

* **మొత్తం ఓటర్లు: 6,68,455**
* **పురుషులు: 3,23,613**
* **మహిళలు: 3,44,713**

ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించడంలో వారు కీలక పాత్ర పోషించనున్నారు.

**ఉమ్మడి జిల్లా వారిగా మున్సిపాలిటీల వివరాలు..**

**నల్గొండ :** నల్గొండ కార్పొరేషన్, మిర్యాలగూడ, చిట్యాల, చండూరు, నందికొండ, హాలియా, దేవరకొండ.. నల్గొండ మున్సిపాలిటీని కార్పొరేషన్ గా మారుస్తూ ఇటీవలనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నూతనంగా ఏర్పడ్డ నల్గొండ కార్పొరేషన్ లో 48 డివిజన్లలో ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలిచి మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అండతో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉత్సాహంతో ఉరకలేస్తున్నారు.

**సూర్యాపేట:** సూర్యాపేట, తిరుమలగిరి, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల

**యాదాద్రి:** భువనగిరి,ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూరు, చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి

**యాదాద్రిలో హోరాహోరీ..**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని 6 మున్సిపాలిటీలపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి సారించింది. గత పంచాయతీ ఎన్నికల్లో ఇక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్ సమానంగా స్థానాలు సాధించడంతో, ఈసారి పురపాలక ఎన్నికల్లో ఆధిక్యం సాధించి గులాబీ పార్టీని దెబ్బకొట్టాలని కాంగ్రెస్ నేతలు ప్రణాళికలు రచిస్తున్నారు. అటు బీఆర్ఎస్ సైతం తమ పట్టును నిరూపించుకోవాలని భావిస్తుండటంతో ఇక్కడ పోరు రసవత్తరంగా మారింది.

# గిరిజన శాఖలో చత్రు ఛాయలపై ఆరోపణల వెల్లువ!

- విచారణలు, మెమోలు ఉన్నా వీడని డిప్యూటేషన్.!
- ఉద్యోగులపై వేధింపులు, నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు..
- పదో తరగతి పరీక్షల వేళ విద్యార్థుల భవితవ్యం గాలికి..




నల్గొండ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పై జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు (ఇన్‌సెట్‌లో) నల్గొండ జిల్లా గిరిజన శాఖ అధికారి చత్రు నాయక్..

**నల్గొండ,మహా:** జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో అక్రమాల పర్వం కొనసాగుతోంది. డిప్యూటేషన్‌పై జిల్లా గిరిజన సంక్షేమ అధికారి (DTDO)గా బాధ్యతలు చేపట్టిన శ్రీ చత్రు నాయక్ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయనపై అనేక అధికారిక విచారణలు, షోకాజ్ నోటీసులు, మెమోలు ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు డిప్యూటేషన్ రద్దు చేయకపోవడం వెనుక పెద్ద ఎత్తున రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అరోపణల చిట్టా.. చాంతడంతా!**

చత్రు నాయక్ పనితీరుపై ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ద్వారా అధికారికంగా ఆర్టికల్ ఆఫ్ ఛార్జెస్ జారీ అయ్యాయి. ఆయనపై ఉన్న ప్రధాన ఆరోపణలు ఇవే..వేధింపులు: కింది స్థాయి ఉద్యోగులను కులం పేరుతో దూషించడం, మానసిక ఒత్తిడికి గురి చేయడం.నిధుల గోల్‌మాల్: అధికార దుర్వినియోగానికి పాల్పడి నిధులను పక్కదారి పట్టించడం.తప్పుడు నివేదికలు: రాష్ట్ర కమిషనర్ కార్యాలయాన్ని తప్పుదోవ పట్టించేలా తప్పుడు మెడికల్ రిపోర్టులు సమర్పించడం.పెండింగ్ విచారణలు: గతంలో మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేసిన సమయంలోనూ ఆయనపై విచారణలు పెండింగ్‌లో ఉండటం గమనార్హం.

**జిల్లా కలెక్టర్ విచారణ.. నివేదిక ఏది?**

ఈ అధికారి అక్రమాలపై జిల్లా కలెక్టర్ ఇప్పటికే అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)ను విచారణాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగ సంఘాలు సైతం ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోకపోవడంపై గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. రాజకీయ నాయకుల అండ చూసుకుని ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**విద్యార్థుల భవితవ్యం గాలికి..**

పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్న వేళ గిరిజన విద్యార్థుల సంక్షేమం పూర్తిగా అటకెక్కింది.నిర్లక్ష్యం: ఎస్సీ, బీసీ శాఖలు ఇప్పటికే పరీక్షల మెటీరియల్ అందించి, అవగాహన సదస్సులు నిర్వహిస్తుంటే.. గిరిజన శాఖలో మాత్రం కేవలం 'పర్సంటేజీల' పంచాయతీలే నడుస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి.శిథిలమైన గోడలు: నెరేడుకొమ్ము గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రహారీ గోడ కూలిపోతున్నా పట్టించుకునే నాథుడే లేడు.

**మంత్రులకు వినతులు..**

ఈ వివాదాస్పద అధికారిని తక్షణమే డిప్యూటేషన్ నుంచి తొలగించాలని ఇప్పటికే జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రులకు బాధితులు పూర్తి వివరాలతో కూడిన లేఖలను సమర్పించారు. పేద గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకోవాలని గిరిజన నాయకులు, ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి."ఆ అధికారిపై ఇన్ని ఆరోపణలు ఉన్నా, విచారణలు జరుగుతున్నా సీటులో ఎలా కొనసాగిస్తారు? డిప్యూటేషన్ రద్దు చేయకపోవడం వెనుక మర్మమేంటి?" అనేది ఎవరికి అంతు చిక్కని ప్రశ్న. నల్గొండ జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పై జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కు ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు.

## క్రెడిట్ కార్డ్ లిమిట్ ఇంక్రీస్ పేరుతో
# జనాలకు కుచ్చు టోపి

### నిందితుడిని అరెస్ట్ చేసిన ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్




**హన్మకొండ మహా ;** క్రెడిట్ కార్డ్ అమౌంట్ ఇంక్రిస్ చేస్తానని, అమాయకుల క్రెడిట్ కార్డ్స్ నుండి అమౌంట్ ట్రాన్స్ఫర్ చేసుకుంటూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న బలోజు అఖిల్ అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు హనుమకొండ పోలీస్ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ తెలిపారు. బలోజ్ అఖిల్ ఇంతకు ముందు ఎస్బిఐ బ్యాంకు క్రెడిట్ కార్డ్స్ ఎగ్జిక్యూటివ్ గా పనిచేసినప్పుడు తన దగ్గరకు వచ్చిన కస్టమర్స్ ని మోసం చేసి క్రెడిట్ కార్డు అమౌంట్ లిమిట్ ఇంక్రీజ్ పేరుతో మోసం చేసి తన అకౌంట్ లోకి డబ్బులు ట్రాన్స్ఫర్ చేసుకోగా సుబేదారి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. ఈ విషయం తెలిసి ఎస్బిఐ బ్యాంకు వారు ఇతనిని విధుల్లో నుండి తొలగించారు. ఆ తర్వాత కూడా తాను ఎస్బిఐలో ఎగ్జిక్యూటివ్ గా పని చేస్తున్నానని చెప్పి తనకు తెలిసిన పాత కస్టమర్ల దగ్గరికి వెళ్లి క్రెడిట్ కార్డు అమౌంటు లిమిట్ ఇంక్రీజ్ చేస్తానని చెప్పి హనుమకొండ కు చెందిన ముగ్గురు బాధితుల దగ్గర నుండి సుమారు రెండు లక్షలు తన అకౌంట్లోకి ట్రాన్స్ఫర్ చేసుకున్నాడు. అదేవిధంగా హుస్నాబాద్ కు చెందిన బాధితుని నుండి 1,40,000 ట్రాన్స్ఫర్ చేసుకొని మోసం చేసాడని ఇన్స్పెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ సర్విస్ సెంటర్, మీసేవ సెంటర్ ఇతర రిటైలర్స్ వారు క్రెడిట్ కార్డ్ హోల్డర్ ఫిజికల్ గా మీదగ్గరికి రాకుండా, ఎవరితో అయిన కార్డ్ పంపిన, మరొక వ్యక్తి కార్డ్ తెచ్చి ట్రాన్స్ఫర్ చేయమని చెప్పినా , అమౌంట్ ట్రాన్స్ఫర్ చేయకూడదని ఫోన్లో మాట్లాడి ఓటిపి చెప్పి కూడా అమౌంట్ ట్రాన్స్ఫర్ చేయకూడదని ఒక వేళ గుర్తు తెలియని వ్యక్తులు తెచ్చిన కార్డ్స్ తో అమౌంట్ ట్రాన్స్ఫర్ చేసినచో తదుపరి చర్యలకు భాధ్యులు అవుతారని హెచ్చరించారు. నిందితుని వద్ద నుండి i20 ఆస్థా కారు తో పాటు 10000 రూపాయలు నగదు ఒక గూగుల్ మొబైల్ ఫోన్ 30000 విలువ సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి బ్యాంకు వద్దకు వెళ్లి బ్యాంకు సిబ్బంది వారితో క్రెడిట్ కార్డు సంబంధించిన విషయాలు చర్చించాలని ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్ కోరారు.




# మేడారం జాతర మన తెలంగాణ ప్రతీక

సమ్మక్క సారలమ్మ విందు కార్యక్రమం
పాల్గొన్న గందె నవీన్, పుర ప్రముఖులు

**వరంగల్ మహా;** మేడారం జాతర 28వ తేదీ బుధవారం ప్రారంభం సందర్భంగా 28వ డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన నవీన్ వరంగల్ లో ఉన్నటువంటి తన స్నేహితులు, బంధుమిత్రులకు తెలంగాణ సాంప్రదాయ పద్ధతిలో విందు ఏర్పాటు చేశారు. మొదటగా మేడారం సమ్మక్క సారలమ్మ పూజా కార్యక్రమాలు చేసుకొని అమ్మవార్లకు బెల్లం (బంగారం) సమర్పించుకొని జ్యోతి ప్రజ్వలన చేసి గందె నవీన్ విందు కార్యక్రమం ప్రారంభించారు. శ్రీ కన్వెన్షన్ 28వ డివిజన్ హంటర్ రోడ్ జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖులతోపాటు, డాక్టర్లు, అడ్వకేట్లు, ఇంజనీర్లు, వర్తక వ్యాపారులు కార్యక్రమానికి విచ్చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గందె నవీన్, ఐత ప్రసాద్ తాటికొండ రాము, మట్టెవాడ విజయ్ పశుపతి, డాక్టర్ సుధీర్, భువనేశ్వర్, డాక్టర్ భువనేశ్వర్, డాక్టర్ రాము, కొత్తపెల్లి రాజేష్, వివిధ ప్రముఖులు పాల్గొన్నారు

# పురపోరుకు ఖాకీ పహారా

## నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి: డీజీపీ శివధర్ రెడ్డి




**హైదరాబాద్, మహా :** మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ఖరారు కావడంతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ అఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై డిజిపి మాట్లాడుతూ... ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినందున రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని తెలిపారు. అక్రమ నగదు, మద్యం, మాదకద్రవ్యాలు, ఉచితాల పంపిణీని అడ్డుకోవడానికి తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్లను రంగంలోకి దించుతామన్నారు. 50 వేల రూపాయల కన్నా ఎక్కువ నగదును తీసుకు వెళుతున్నట్లయితే తగిన ఆధారాలు చూపించాలని, లైసెన్స్ కలిగిన ఆయుధాలన్నీ వెంటనే డిపాజిట్ చేయాలని, అక్రమ ఆయుధాల ఏరివేతకు ప్రత్యేక సోదాలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఇటీవల ముగిసిన గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా 1800 ఆయుధాలను ఆయా పోలీస్ స్టేషన్లో అప్పగించారని తెలిపారు.పాత నేరస్తులు, రౌడీషీటర్లు, గత ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడిన వారిని గుర్తించి ఆర్థిక పూచీకత్తుతో బైండోవర్ చేస్తున్నామని వివరించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో 24/7 పని చేసేలా ప్రత్యేక ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. 1000కి పైగా ఉన్న అతి సున్నిత, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజల్లో భరోసా కల్పించేందుకు సాయుధ బలగాలతో 'ఫ్లాగ్ మార్చ్' నిర్వహిస్తామని డీజీపీ ప్రకటించారు. రాష్ట్రంలో రెండో విడత సాధారణ పురపాలక ఎన్నికల కింద మొత్తం 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో పోలింగ్ జరగనుందని డిజిపి వివరించారు. కొత్తగూడెం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, నిజామాబాద్, నల్గొండ, రామగుండం కార్పొరేషన్ల పరిధిలోని 414 వార్డులతో పాటు, 116 మున్సిపాలిటీల్లోని 2582 వార్డుల్లో ఎన్నికల నిర్వహణకు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ప్రక్రియను అమలు చేసేందుకు స్థానిక పోలీసులకు అదనంగా తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ (టీజీఎస్పీ) మరియు ఇతర విభాగాల బలగాలను మోహరిస్తున్నట్లు డిజిపి తెలిపారు. పోలీస్ శాఖకు సంబంధించిన సిబ్బంది కాకుండా ఎక్సైజ్ , ఫారెస్ట్ శాఖలకు సంబంధించిన రెండు వేల మంది బందోబస్తు కోసం అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సహకారంతో ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద భౌతిక పహారాతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల నుంచి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు మరియు కౌంటింగ్ హాల్స్ వరకు ప్రోటోకాల్ ప్రకారం అంచెలంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, భయం లేని వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా పోలీస్ సిబ్బంది పహారా ఉంటుందని డిజిపి స్పష్టం చేశారు. శాంతిభద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్ సమావేశంలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో విజయ దంకా మోగిస్తాం

### తుమ్మల వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు



**వలిగొండ, మహా:** వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ విజయ దంకా మోగిస్తుందని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకటరెడ్డి అన్నారు మంగళవారం మహా న్యూస్ ప్రతినిధితో మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుస్తామని దిమా వ్యక్తం చేశారుకాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలే మా గెలుపుకు దోహదబడతాయి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఆర్థిక సహాయం అందజేసిన ఏలే చంద్రశేఖర్

**వలిగొండ, మహా :** మండల పరిధిలోని గోకారం గ్రామానికి చెందిన చెరుకు గంగమ్మ కుమారుడు చెరుకు శ్రీను ఇటీవల కాలంలో మృతి చెందడంతో ఆ కుటుంబానికి బిజెపి రాష్ట్ర నాయకులు ఏలే చంద్రశేఖర్ 20వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు ఏలేచంద్రశేఖర్ మాట్లాడుతూ వారి పిల్లలకు ఫస్ట్ క్లాస్ నుండి టెన్త్ క్లాస్ వరకు బిజెపి మండల పార్టీ నుండి స్కూల్ ఫీజు సహాయం చేస్తామని హామీ ఇచ్చారు అలాగే గోకారం బిజెపి గ్రామ శాఖ నుండి 5000 రూపాయలు ఆర్థిక సాయం చేశారు ఈ కార్యక్రమంలో వలిగొండ మండల బిజెపి అధ్యక్షులు బోళ్ల సుదర్శన్ పబ్బ రమేష్ చెరుకు దానయ్య బైరుమల్లేశం రాధారపు మల్లేశం ఏరువా యాదయ్య వీరమల్ల బాసయ్య విజయ్ ఏ కృష్ణ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు

# అక్రెడిటేషన్ల జీవోను సమూలంగా సవరించాలి

### మంత్రిని, స్పెషల్ కమీషనర్ ను కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



**హైదరాబాద్, మహా :** మీడియా అక్రెడిటేషన్ల జీవో 252ను సవరించడం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర సమాచార పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ కమీషనర్ సీహెచ్ ప్రియాంక లకు కృతజ్ఞతలు తెలిపారు. ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, రాష్ట్ర కోకన్వీనర్లు తన్నీరు శ్రీనివాస్, కుడుతాడు బాపురావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవి కుమార్, నాయకులు శ్రీధర్, శ్రీనివాస్, రవికుమార్ తదితరులు మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, సమాచార భవన్ లో కమీషనర్ ప్రియాంక ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జీవో 252 సవరణ సమూలంగా జరగలేదని, మరోసారి జీవోను పున:సమీక్షించి సవరించాలని వారు కోరారు. జీవో సవరణలో కేబుల్ చానల్స్, నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లకు న్యాయం జరగడం లేదని, గతంలో కేబుల్ ఛానల్స్ కు ఐఅండ్ పీఆర్ ద్వారా 12 రాష్ట్రస్థాయి అక్రెడిటేషన్ కార్డులు, నాలుగు జిల్లా స్థాయి అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేవారని, ఈ విషయాన్ని తాము పలు తమరి దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, సవరించిన జీవోలో కేబుల్ చానల్స్ అంశమే లేకపోవడం బాధాకరమని అన్నారు. యూనియన్ గా తమ అభిప్రాయాన్ని చెప్పినప్పటికీ కేబుల్ చానల్స్ విషయంలో, నియోజకవర్గ స్థాయిలో రిపోర్టర్లకు ఇచ్చే కార్డుల విషయంలో ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమని, అదే విధంగా ఎంపానల్మెంట్ లేని చిన్న, మధ్య తరహా పత్రికలకు గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఇచ్చినట్లు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని, అదే విధంగా రెగ్యులర్ గా నడుస్తున్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని వారు మంత్రిని, కమీషనర్ ను కోరారు.

**ప్రెస్'స్టిక్కర్ నిబంధన తొలగించాలి**

అక్రెడిటేషన్ కార్డు ఉన్న జర్నలిస్టులు మాత్రమే తమ వాహనాలకు 'ప్రెస్' అని రాసుకోవాలంటూ జారీ చేసిన సర్క్యులర్ ను రద్దు చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య కోరారు. ఈ మేరకు ఆయన, పలువురు ఫెడరేషన్ నాయకులు మంగళవారం సమాచార పౌరసంబధాల శాఖ స్పెషల్ కమీషనర్ ప్రియాంక ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సర్క్యులర్... జర్నలిస్టులను, జర్నలిజం వృత్తిని అవమానించేదిగా ఉందని, జర్నలిస్టులకు కేవలం సంక్షేమ పథకాల కోసం గుర్తింపు కార్డుగా ఇచ్చే అక్రెడిటేషన్ కార్డును జర్నలిస్టుగా గుర్తించేందుకు ప్రామాణికం చేయడం తగదని, అక్రెడిటేషన్ కార్డు ఉన్న వారే తమ వాహనాలకు "ప్రెస్"అని రాసుకోవాలనే నిబంధన సరైంది కాదని, ఈ సర్క్యులర్ నిబంధన ఇటు జర్నలిస్టుల సమాజానికి, అటు జర్నలిజం వృత్తి స్వేచ్ఛకు భంగం కలుగుతుందని మామిడి సోమయ్య కమీషనర్ తో అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చే అక్రెడిటేషన్ కార్డు కలిగి ఉన్న జర్నలిస్టులు మాత్రమే జర్నలిస్టులు కాదని, అక్రెడిటేషన్ కార్డు లేని జర్నలిస్టులు చాలా మంది ఉన్నారని తెలిపారు.

## ఉద్యమకారులను గుర్తించకుంటే
# పతనం తప్పదు

### సంగిశెట్టి క్రిస్టఫర్ మలిదశ ఉద్యమకారుడు

**భువనగిరి, మహా:**రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను లెక్కచేయకుండా బుల్లెట్ గాయాలు తగిలిన పోలీసుల లాఠీ దెబ్బలు తిన్న జైలు జీవితాలను గడిపి రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులను గుర్తించకుంటే ప్రభుత్వం పతనం తప్పదని మలిదశ ఉద్యమకారుడు టీయు జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమకారులు రోడ్డున ఉంటే రాష్ట్రాన్ని వ్యతిరేకించిన ద్రోహులు భోగాలు అనుభవిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు తెలంగాణ ఉద్యమకారులు చరిత్రలు నిలిచిపోతారని అన్నారు ఉద్యమకారులను గుర్తించకుంటే ఉసురు తగులుతుందని ఆయన శాపనార్థాలు పెట్టారు

# డాలర్లు సంపాదిస్తున్నా మూలం మర్చిపోని కవి అఫ్సర్

## మఖ్దూం పురస్కార సభలో గోరటి వెంకన్న



**హైదరాబాద్, మహా:** అమెరికాలో ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో విధులు నిర్వహిస్తూ డాలర్లు సంపాదిస్తున్నా, తన మూలాలను మరచిపోని కవి అఫ్సర్ అని సుప్రసిద్ధ కవి, తెలంగాణ శాసన మండలి సభ్యులు గోరటి వెంకన్న అన్నారు. మంగళవారం ప్రభుత్వ సిటీ కాలేజీ మఖ్దూం మొహియుద్దీన్ నేషనల్ అవార్డు ప్రదాన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మఖ్దూం అవార్డును అఫ్సర్ కు ప్రదానం చేయడం అవార్డుకే గౌరవమన్నారు. అఫ్సర్ కవిత్వంలో తాత్వికత, వేదన, ఆవేదన వుంటుందన్నారు. కాలం మారిపోతుంది. పోతులూరి, వేమన, మఖ్దూం వారసత్వంతో అంతర్జాతీయ స్థాయిలో మంచి సాహితీవేత్తగా గుర్తింపు పొందాడని అన్నారు. కవిగానే కాక కథకుడిగా, పరిశోధకుడిగా, విమర్శకుడిగా అఫ్సర్ నిర్వహించిన పాత్ర ప్రశంసనీయమని అన్నారు. చారిత్రాత్మక సిటీ కాలేజీ ఇలాంటి అవార్డు నెలకొల్పటం అభినందనీయమన్నారు. మీ కోసం మీరు బతకడంకాదు, లోకం కోసం బతకండి అంటూ విద్యార్థులకు హితవు చెప్పారు. పదవే గీతమా...పదవే నా ప్రాణమా అన్న మఖ్దూం అనువాద గీతంతో పాటు తాను రచించిన ఎన్నో పాటలు పాడి సభను ఆద్యంతం అలరింపజేశారు.

**మఖ్దూం తెలంగాణలోని ప్రతి ఉద్యమంలో భాగం - మఖ్దూం పురస్కార గ్రహీత అఫ్సర్**

పురస్కార గ్రహీత అఫ్సర్ మాట్లాడుతూ తనకు ఎన్ని పురస్కారాలు వచ్చినా మఖ్దూం మొహియుద్దీన్ జాతీయ అవార్డు స్వీకరించటం సంతృప్తిని ఇచ్చిందని, తనను ఎంపిక చేసిన పురస్కారకమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. సిటీ కళాశాల అంటే ఓ చరిత్ర. శతవసంతాల చరిత్ర గల కళాశాల ఇది. ఇక్కడి నుండి అధ్యాపకుడిగా మఖ్దూం మొహియుద్దీన్ ప్రస్థానం ప్రారంభంకావడం విశేషమన్నారు. తాను ఒక కుగ్రామం నుంచి అమెరికా దాకా వెళ్ళానని, భాష, జ్ఞానం తోడుంటే ఎక్కడి దాకా అయినా ప్రయాణం చెయ్యొచ్చన్నారు. తన తండ్రికి మఖ్దూంతో సాన్నిహిత్యం ఉండేదన్నారు. మఖ్దూం కేవలం ఒక కవి మాత్రమే కాదు. తెలంగాణలోని ప్రతీ ఉద్యమంలో భాగమయ్యారని అన్నారు. అందుకు ఆయన సాహిత్యాన్ని ఓ సాధనంగా చేసుకున్నారని చెప్పారు. ఇన్నేళ్ళ తర్వాత కూడా మఖ్దూం మొహియుద్దీన్ ను ఇలా అవార్డు ద్వారా స్మరించుకోవడం మరిచిపోలేని విషయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు కనీసం ఒక్క మఖ్దూం కవితనైనా చదవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్. ప్రసాద్ మాట్లాడుతూ అర్హత గలవారికి అవార్డును ఇవ్వడం ఆ అవార్డుకే గౌరవమన్నారు. కవిగా, కార్మికోద్యమ నాయకుడిగా, అధ్యాపకుడిగా, శాసన సభ్యుడిగా తెలుగు సమాజంపై మఖ్దూం వేసిన ప్రభావం అసామాన్యమైందని అన్నారు. మఖ్దూం రచించి రవీంద్ర భారతిలో ప్రదర్శింపజేసిన నాటకాన్ని చూసిన రవీంద్రనాథ్ ఠాగూర్ ఎంతో ముగ్ధుడై శాంతినికేతన్ లో విద్యాభ్యాసానికి రమ్మని ఆహ్వానించారని గుర్తు చేశారు. విదేశాల్లో మన భాషను బోధిస్తున్న కవి అఫ్సర్ కు మఖ్దూం మొహియుద్దీన్ జాతీయ అవార్డును ప్రదానం చేయటం ముదావహమన్నారు. మట్టివాసనతో జాతి నిర్మాణానికి పాటు పడిన మఖ్దూం మొహియుద్దీన్ ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆత్మీయ అతిథి డాక్టర్ యాకూబ్ మాట్లాడుతూ మఖ్దూం ప్రగతిశీల భావజాలాన్ని మాత్రమే కాకుండా జాతీయ సమైక్యతను, దేశభక్తిని తన సాహిత్యం ద్వారా, ఆచరణ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పాడని అన్నారు. సాహిత్యం సమాజ దిశను మార్చాలని మఖ్దూం చేసిన ప్రయత్నాలు గొప్పవని అన్నారు. విశిష్ట అతిథి సినీ దర్శకులు, రచయిత వేణు ఊడుగుల మాట్లాడుతూ కార్పొరేట్ కాలేజీలను తలదన్నే మంచి కళాశాల సిటీ కళాశాల అన్నారు. అఫ్సర్ తనకు స్ఫూర్తినిచ్చిన కవి అని, అతనికి ఈ పురస్కారం ఇవ్వటం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని అన్నారు. ఆత్మీయ అతిథి కటుకోజ్వల ఆనందాచారి ప్రసంగిస్తూ ఈ కళాశాలలో లెక్చరర్ గా పనిచేసిన మఖ్దూం మొహియుద్దీన్ అభ్యుదయ రచయిత, ప్రపంచ నియంతల విధానాలకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. నాటి మఖ్దూం మొహియుద్దీన్ పోరాటపటిమను స్ఫూర్తిగా తీసుకుని నేటి రచయితలు రచనలు చేయాలన్నారు. సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అవార్డు కమిటీ కన్వీనర్ డా.విప్లవ దత్ శుక్లా మఖ్దూం జీవిత రేఖలను పరిచయం చేయగా, మరో వైస్ ప్రిన్సిపాల్ డా.శాంతి మాట్లాడుతూ మఖ్దూం మొహియుద్దీన్ అడుగుజాడల్లో నడవాలని విద్యార్థులకు హితవు చేశారు. కమిటీ సభ్యులు డా.కోయి కోటేశ్వరరావు, ఐక్యూయేసి సమన్వయకర్త డా.జె.నీరజ సభను సమన్వయం చేశారు.

HEALTH & BUSINESS AWARDS-2026

ANN Telugu & Mahaa Daily Presents

# HEALTH & BUSINESS ICON AWARDS 2026

February 2026




## ఆ సీన్స్‌లో నా కన్నీళ్ళు నిజం: ఈషా రెబ్బా

తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బా హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'ఓం శాంతి శాంతి శాంతిః'. మలయాళ హిట్ ఫిల్మ్ 'జయ జయ జయ జయహే'కి రీమేక్‌గా ఈ చిత్రం రూపొందింది. ఏఆర్ సజీవ్ దర్శకత్వంలో సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ సనివరపు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న కానుంది. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈషా రెబ్బా మాట్లాడుతూ– "ఈ చిత్రంలో శాంతి అనే పాత్ర చేశాను. ఇలాంటి క్యారెక్టర్ చేయాలని ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్నాను. నా హండ్రెడ్ పర్సెంట్ ఎఫర్ట్స్ పెట్టాను. ఈ సినిమాలో నేను చెంపదెబ్బలు తిన్న సీన్స్ ఉన్నాయి. ఆ సీన్స్‌లో నా కళ్ళలో వచ్చిన నీళ్ళు రియల్. ఈ సినిమాలో ఓ యాక్షన్ సీక్వెన్స్ ఉంది. ఈ సీన్‌లో తరుణ్ భాస్కర్‌కి, నాకూ దెబ్బలు తగిలాయి. సంజీవ్ క్లియర్ విజన్ ఉన్న దర్శకుడు. ప్రస్తుతం తెలుగులో కథలు వింటున్నాను. ఒక తమిళ చిత్రంలో నటిస్తున్నాను" అని చెప్పారు.



## రజినీకాంత్ క్రేజీ సినిమాలో సాయిపల్లవి

నటుడు రజనీకాంత్ హీరోగా నటించనున్న నూతన చిత్రంలో నటి సాయిపల్లవి నటించనున్నారా..? ఈ ప్రశ్నకు అలాంటి అవకాశం ఉంది అంటూ కోలీవుడ్ వర్గాల నుంచి సమాధానం వస్తుంది. రజనీకాంత్ ప్రస్తుతం జైలర్ –2 చిత్రాన్ని పూర్తి చేసే పనిలో ఉన్నారు. తదుపరి కమలహాసన్ తన రాజ్ కమల్ ఇంటర్నేషనల్ ఫిలింస్ పతాకంపై నిర్మించనున్న చిత్రంలో నటుడు రజనీకాంత్ నటించనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని శిబి చక్రవర్తి తెరకెక్కించనున్నారు. అనిరుధ్ సంగీతాన్ని అందించే ఈ చిత్రం త్వరలో సెట్ పైకి వెళ్లనుందని సమాచారం. కాగా ఇందులో నటించే ఇతర తారాగణం గురించిన వివరాలు ఇంకా వెలువడకున్నా, ముఖ్య పాత్రలో నటి సాయిపల్లవిని నటింపజేయడానికి చర్చలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ మధ్య నటుడు కమలహాసన్ నిర్మించిన అమరన్ చిత్రంలో సాయిపల్లవి కథానాయకిగా నటించిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం ఈమె హిందీలో ఏక్ ధిన్, రామాయణ 1,2 చిత్రాల్లో నటిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమిళంలో రజనీకాంత్ హీరోగా నటించనున్న 173వ చిత్రంలో సాయిపల్లవి నటించనున్నారనే ప్రచారం హోరెత్తుతోంది. అయితే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదన్నది గమనార్హం. కాగా నటుడెవరైనా, దర్శకుడెవరైనా తన పాత్రకు ప్రాముఖ్యత ఉంటేనే నటి సాయిపల్లవి నటించడానికి అంగీకరిస్తారన్నది తెలిసిందే. దీంతో ఈమె రజనీకాంత్ చిత్రంలో నటించడానికి సై అంటారా? అన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది. కాగా ఇటీవల రజనీకాంత్ హీరోగా నటించిన కూలీ చిత్రంలో నటి శృతీహాసన్ ముఖ్య పాత్రలో నటించడం గమనార్హం. రజనీ సినిమాలో సాయిపల్లవి పాత్ర బలంగా ఉంటే తప్పకుండా చేస్తుందని ఆమె అభిమానులు చెబుతున్నారు. గతంలో తనకు చిరంజీవి సినిమా ఛాన్స్ వచ్చినా సరే రిజెక్ట్ చేసిన విషయం తెలిసిందే.



## అలా అయితేనే పెళ్లి..
## వింత కండిషన్ పెట్టిన నటి

బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ నిక్కీ తంబోలి, నటుడు అర్బాజ్ పటేల్ ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. త్వరలో ఈ జంట పెళ్లి చేసుకోబోతుందనే ప్రచారం కూడా జరిగింది. దీనిపై తాజాగా నిక్కీ తంబోలి స్పందించారు. ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఆలోచన లేదని ఆమె స్పష్టం చేసింది. అంతేకాదు తమ పెళ్లికి ఓ వింత కండీషన్ కూడా పెట్టుకున్నారట. అదేంటే.. నిక్కీ లేదా అర్బాజ్.. ఇద్దరిలో ఒకరు ఏదో ఒక రియాల్టీ షోలో విన్నర్‌గా గెలిస్తే పెళ్లి చేసుకుంటారట. గెలుపు అనేది పాజిటివ్ ఎనర్జీ అని.. విజయం తర్వాతే వివాహ బంధంలోకి అడుగుపెడతామని నిక్కీ చెప్పుకొచ్చింది. కాగా, ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభం కానున్న 'ది ఫిఫ్టీ' రియాలిటీ షోలో ఈ జంట కలిసి పాల్గొంటోంది. ఇందులో మొత్తం 50 మంది సెలబ్రిటీలు పోటీపడుతున్నారు. ఈ షోకి ప్రముఖ కొరియోగ్రాఫర్, దర్శకురాలు ఫరా ఖాన్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com